బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో..


# భాగవత సన్నివేశాల అంతరార్థం

## తటవర్తి వీరరాఘవరావు



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...

# భాగవత సన్నివేశాల అంతరార్థం




రచన & ప్రచురణ :

## తటవర్తి వీరరాఘవరావు


ప్రథమ ముద్రణ : ఆగస్టు, 2012

ప్రతులు : 6,000

వెల : **రూ. 25/-లు**



**పుస్తకముల కొరకు : తటవర్తి వీర రాఘవరావు**

**తటవర్తివారి వీధి, భీమవరం - 534 201. ప॥గో॥జిల్లా.**

**ఫోన్ : 08816 - 234353, సెల్ : 9440309812**

email : balajipyramid.bvrm@gmail.com

# విషయ సూచిక


| | |
|---|---|
| భాగవత సన్నివేశాల అంతరార్థం | 3 |
| శ్రీ కృష్ణుడు కారాగారంలో జన్మించడం | 5 |
| దుష్టశిక్షణ - శిష్ట రక్షణ | 7 |
| శ్రీ కృష్ణుడు వెన్న, పాలు, పెరుగు దొంగిలించడం | 10 |
| శ్రీ కృష్ణుడు రోలు లాగడం | 13 |
| శ్రీ కృష్ణుడు నోటిలో సమస్త లోకాలు చూపించడం | 16 |
| కాళిందుని పడగపై నాట్యం చెయ్యడం | 19 |
| రాక్షసులను అవలీలగా సంహరించుట | 21 |
| గోపికల జలకాలాట - శ్రీ కృష్ణునిచే వస్త్రాపహరణం | 23 |
| శ్రీ కృష్ణుడు - గోపికలతో క్రీడించడం | 26 |
| శ్రీ కృష్ణుడు గోవులను కాయడం | 28 |
| శ్రీ కృష్ణుడు గోవర్ధనగిరి ఎత్తడం | 30 |
| చాణూర - ముష్టికులనే మల్లులను ఓడించడం | |
| మదపుటేనుగును నేలకూల్చడం | 32 |
| కంసుని సంహరించడం | 33 |
| శిశుపాలుని 100 తప్పులు క్షమించడం | 35 |
| కుచేలునికి మర్యాద చెయ్యడం | 40 |
| పురాణ గాధలు - శాస్త్రాలు | 42 |
| శిబిచక్రవర్తి | 43 |
| భక్త కన్నప్ప | 44 |
| యమలోకం | 46 |
| భక్తమార్కండేయ | 51 |



**పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ - ఇండియా**

ధ్యానం గురించి మరింత సమాచారం కొరకు ఈ క్రింది వెబ్‌సైట్‌లను దర్శించండి.

1) www.pssmovement.org, 2) www.meditationeverywhere.org,

3) www.pyramidvalley.org, 4) www.pyramidseverywhere.org

తెలుగులో సమాచారం కొరకు http://pssmovement.org/telugu/

# భాగవత సన్నివేశాల అంతరార్థం



ప్రస్తుతం లోకంలో భాగవతమంటే ఏమిటి? అని అడిగితే చెప్పలేని వారు కూడా వున్నారు. శ్రీ కృష్ణుని గురించి తెలుసు, కానీ శ్రీ కృష్ణుని జీవిత చరిత్రే భాగవతమని చాలా మందికి తెలియదు.

భాగవత మహాకావ్యం ద్వారా వ్యాస మహర్షి శ్రీ కృష్ణ భగవానుని జీవితం గురించి, జీవితంలోని ముఖ్యమైన విషయాల గురించి కొన్ని సన్నివేశాల ద్వారా లోకానికి తెలియచేయడం జరిగింది.

కానీ లోకంలో శ్రీ కృష్ణ భగవానుని జీవితంలో జరిగిన సంఘటనలనుసినిమాల రూపంలో, నాటకాల రూపంలో, టి.వి. సీరియల్స్ రూపంలో చిత్రించుకుని చూసి వినోదిస్తున్నారు, కాలక్షేపానికి ఉపయోగించుకుంటున్నారు. కానీ అంతటి మహానుభావుని జీవిత చరిత్ర వినోదంగా చూడటానికి వ్యాస మహర్షి లోకానికి ఇవ్వలేదు. శ్రీ కృష్ణుని జీవితంలోని ప్రతీ సన్నివేశం ద్వారా ఒక సందేశాన్ని ఆయన లోకానికి అందివ్వడం జరిగింది. అందుచేత ప్రతీ సన్నివేశాన్ని **"వినోదాత్మకంగా కాదు.**

**సందేశాత్మకంగా చూడాలి".** వినోదానికి ఉపయోగించుకోవడం కాదు, ఆ సన్నివేశాలలోని అంతరార్థాన్ని తెలుసుకుని, ఆ సందేశాన్ని ఆచరణలో పెట్టాలి. అపుడే ఎవరి జీవితమైనా ధన్యమవుతుంది.

అంతేకాదు భాగవతం అర్థం కావాలన్నా భాగవతంలోని సన్నివేశాలు అర్థం కావాలన్నా, ముఖ్యంగా శ్రీ కృష్ణ భగవానుడు ఎవరో తెలుసుకోవాలి. శ్రీ కృష్ణుని గురించి తెలుసుకోకుండా, అవగాహన లేకుండా భాగవతం ఎప్పటికీ అర్థం కాదు.



ముఖ్యంగా శ్రీ కృష్ణుడు అనగానే ప్రతి ఒక్కరూ ఆయన రూపాన్నే వూహించు కుంటారు. ఆ రూపమే శ్రీ కృష్ణుడు అను కుంటారు. రూప దృష్టితో చూస్తూ అలాగే భావిస్తూ భాగవతాన్ని చదువుతారు. అందు లోని సన్నివేశాలు సంఘటనలు అలా బాహ్య దృష్టితోనే అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తారు. అందుకే అంతా గందర గోళం, కొన్ని విషయాలు అర్థం కావు. శ్రీ కృష్ణుని ప్రవర్తన అర్థం కాదు.

కానీ గుర్తుంచుకోండి శ్రీ కృష్ణుడు అంటే... కనిపించే, అందరూ ఈ కళ్ళతో చూడగలిగే రూపం కాదు. అంటే దేహం కాదు ఆయన కనిపించని, అనంతశక్తివంతమైన, చావు పుట్టుకలు లేని, అంతటా వ్యాపించి వున్న అందరిలో వున్న 'ఆత్మ' అని తెలుసుకోవాలి. "అహ మాత్మా గుడాకేశా" (భ.గీ. 10-20). అంటే అర్జునా నేను 'ఆత్మను' అని శ్రీ కృష్ణుడే చెప్పాడు కదా?

అందుచేత ఎవరైతే శ్రీ కృష్ణుని 'రూప దృష్టి'తో కాకుండా 'ఆత్మ దృష్టి'తో చూస్తారో వారికి 'భాగవతమే' కాదు శ్రీ కృష్ణుడు బోధించిన 'భగవద్గీత' కూడా చక్కగా అర్థం అవుతుంది. మరి 'ఆత్మ దృష్టి' కలగాలన్నా, 'ఆత్మ స్థితి' రావాలన్నా ఎవరైనా తప్పనిసరిగా ధ్యానం చెయ్యాలి. ధ్యానం చెయ్యకపోతే భాగవతం కానీ, భగవద్గీత కానీ ఎప్పటికీ అర్థం కాదు.

# శ్రీ కృష్ణుడు కారాగారంలో జన్మించడం



శ్రీ కృష్ణ భగవానుడు దేవకీ వసుదేవులకు అష్టమ గర్భంగా కారాగారంలో జన్మించడం జరిగింది. అపుడు కారాగార తాళాలూ దానంతట అవే తెరుచు కున్నాయి. కావలి వాళ్ళంతా మత్తులో జారుకున్నారు. శ్రీ కృష్ణుని గంపలో పెట్టుకుని వసుదేవుడు ద్వారకకు తీసుకుని వెళుతుండగా నది రెండుగా చీలిపోయింది. వర్షం వస్తుంటే ఏడు పడగల పాము తన పడగలను గొడుగులా


వుంచి శ్రీ కృష్ణుని వర్షం బారి నుంచి కాపాడింది. అలా శ్రీ కృష్ణుడు సురక్షితంగా ద్వారకకు చేరుకున్నాడు. వసుదేవుడు తన కార్యాన్ని దిగ్విజయంగా పూర్తి చెయ్యగలిగాడు.

దీని అర్థం తెలుసుకుందాం. అసలు శ్రీ కృష్ణుని జన్మ కారణం ఏమిటి? అంటే ఆయన లోకంలో ధర్మాన్ని స్థాపించడానికి భూమి మీద అవతరించాడు. అలాంటి మహత్తర కార్యం కోసం ఆయన జన్మించాడు కాబట్టి సమస్త ప్రకృతి, ప్రకృతిలోని దేవతలు ఆయనకు సహకరించారు. కనిపించని ఒక దేవత తాళాలు తెరవగా, మరొక దేవత కావలి వాళ్ళను నిద్రలో జారేటట్టుగా చేసింది. అలాగే ప్రకృతిలో భాగమైన యమునా నది రెండుగా చీలిపోయి దారి ఇచ్చింది. వర్షం కారణంగా మరొక దేవత ఏడు పడగల పాము రూపంలో గొడుగు పట్టి ఆయనకు రక్షణ కల్పించింది. అలా వసుదేవుని కార్యం నిర్విఘ్నంగా పూర్తి అయ్యింది.

ఈ సన్నివేశం నుంచి మనం తెలుసుకోవలసిన సందేశం ఏమిటంటే ఎవరవుతే ధర్మాన్ని రక్షిస్తారో! ధర్మాచరణ చేస్తారో! ధర్మాన్ని రక్షించడానికి కృషి చేస్తారో! అలా లోక కళ్యాణకరమైన పనులు చేస్తారో! వారికి ప్రకృతి, ప్రకృతిలోని దేవతలు సదా సహకరిస్తారు, రక్షిస్తూ వుంటారు. అన్ని రకాలుగా వారికి సాయం చేస్తారని ఈ సన్నివేశంలోని అంతరార్థం. అందుచేత మీరు కూడా లోకకళ్యాణకరమైన పనులు చెయ్యండి. ధర్మాన్ని కాపాడండి. ధర్మయుక్తమైన పనులు చెయ్యండి... లోక విరుద్ధమైన, ధర్మ విరుద్ధమైన పనులు చెయ్యకండని చెప్పడమే ఈ సన్నివేశం యొక్క సందేశం.

తెలుసుకోండి మనం అనుకునే దేవుళ్ళు, దేవతలు వున్నారు. ఈ దేవుళ్ళు, దేవతలు మనం ఇచ్చే కొబ్బరికాయలు, అరటిపళ్ళ ఆశిస్తారని మనం భావిస్తాం. కానీ వారంతా మనం ఇచ్చే కొబ్బరి కాయలు, అరటి పళ్ళ కోసం లేరు. వారంతా వాటిని ఆశించే వారు కాదు. దేహం లేని వారు అవేమి చేసుకుంటారు? అందుచేత వారు అలాంటివి ఆశించరని తెలుసుకోవాలి. మరి వారు ఎందుకున్నట్టు? అంటే ఎవరైతే లోక కళ్యాణకరమైన పనులు చేస్తారో! లోకంలో ధర్మాన్ని కాపాడే ప్రయత్నం చేస్తారో! వారందరికీ సదా సాయం చెయ్యడానికి వున్నారు. తప్పనిసరిగా అలాంటి వారికి వారు అదృశ్యరూపంలో సాయం చేస్తారని తెలియచెప్పడమే ఈ సన్నివేశం యొక్క అంతరార్థం. అంతేకాదు లోక కళ్యాణకరమైన పనులు చేసే వారికి సృష్టి నుంచి ప్రకృతి నుంచి కూడా సదా సాయం అందుతుందని చెప్పడమే ఈ సన్నివేశ సందేశం.

# శ్రీ కృష్ణునిచే దుష్ట శిక్షణ - శిష్ట రక్షణ



భాగవతంలోని చాలా సన్నివేశాలలో రాక్షసులను - దుష్టులను శ్రీ కృష్ణ భగవానుడు శిక్షించడం, సంహరించడం కనిపిస్తుంది. అలాగే అల్పులను, అబలలను, నిస్సహాయులను, సన్మార్గంలో వుండే వారిని రక్షించడం కనిపిస్తుంది.

ఇక్కడ రాక్షసులు అనగానే అదొక ప్రత్యేకమైన జాతి అని అనుకోకూడదు. వారూ మానవులే. ఎవరయితే అలాంటి పనులు చేస్తారో వారిని రాక్షసులు అంటారు. రాక్షసుల గుణం ఎదుట వారిని హింసించి, వారు హింసపడుతుంటే తాము ఆనందిస్తుంటారు. అంటే ఎదుట వారి హింసలో ఆనందం పొందేవారిని రాక్షసులు అంటారు. వారినే ప్రస్తుతం మనం 'శాడిస్టులు' అంటాం. అంటే ఇతరుల విషాదంతో వినోదించే వారంతా రాక్షసులే. అంతేకాదు రాక్షసులకు రక్త మాంసాలంటే చాలా ఇష్టం. మాంసాహారమంటే రాక్షసులు చాలా ఇష్టపడతారు.

భాగవతంలోని సన్నివేశాల ద్వారా దేవుడు రాక్షసులను శిక్షిస్తాడని, అంతేకాదు ఒక్కొక్కసారి సంహరించి కఠినంగా శిక్షిస్తాడని మనం తెలుసుకోవచ్చు. అంటే ఎవరైతే అమాయకపు మూగ జంతువులను క్రూరంగా హింసించి చంపుతారో! అలాగే వాటి మాంసం తిని హింసకు కారకులవుతారో! అటువంటి వారు

భగవంతునిచే కఠినంగా శిక్షింపబడతారని చెప్పడమే. శ్రీ కృష్ణుడు రాక్షసులను సంహరించే సన్నివేశాలన్నిటి అర్థం.

కానీ లోకంలోని మానవులకున్న మూఢ నమ్మకం ఏమిటంటే తాము ఎలా జీవించినా, ఏమి చేసినా ఫరవాలేదు. శ్రీ కృష్ణభగవానుని బొమ్మ పెట్టి పూజిస్తే, భజనలు చేస్తే చాలు ఆయన రక్షిస్తాడని భావిస్తారు. అందుకే ఇంటి దగ్గర జీవహింస చేస్తారు. గుడికి వెళ్ళి పూజలు చేస్తారు. కానీ భాగవత సన్నివేశాలను బట్టి ఇలాంటి వారు రక్షింపబడరు, కచ్చితంగా శిక్షింప బడతారని తెలియ చెప్పడమే రాక్షసులను శిక్షించే సన్నివేశాల అర్థం.

అలాగే రాక్షసులు ఎన్నో మాయా రూపాలలో రావడం, శ్రీ కృష్ణ భగవానుడు వారిని కనిపెట్టి సంహరించడం కూడా మనం ఆ సన్నివేశాలలో చూస్తున్నాం.

అలా పూతన, శకటాసురుడు లాంటి రాక్షసులు మారు వేషాలలో, మాయా రూపాల్లో వచ్చినా శ్రీ కృష్ణుడు వారిని కనిపెట్టి వారిని సంహరించడం జరిగింది. అంటే వీటి అర్థం. రాక్షస కార్యాలు చేసే వారు ఎన్ని మాయలు చేసినా, ఎన్ని మోసాలు చేసినా, ఎన్ని తెలివితేటలు ఉపయోగించినా వారు తప్పించుకోలేరు. వారంతా భగవంతుని శిక్షకు పాత్రులు కావలసిందేనని తెలియచెప్పడమే ఈ సన్నివేశాల సందేశం. దీనిని బట్టి ఇంటి దగ్గర హింస చేసి, భక్తునిలా వేషం వేసుకుని, గుడికి వచ్చినా భగవంతుడు కనిపెట్టగలడని తెలుసుకోవాలి. ఆయన నుంచి తప్పించుకోలేరని తెలుసుకోవాలి. అందుచేత దేవుని రక్షణ కోరుకుంటే హింస చేయకూడదని తెలుసుకోవాలి.

అందుచేత ఎవరైనా ఈ లోకంలో బలహీనమైన వారిని కానీ, తెలివి తక్కువ వారిని కానీ, అధికారం లేని వారిని కానీ, నిస్సహాయులైన వారిని కాని, ఆఖరుకు ఏమీ చేయలేని జంతువులనైనా కానీ హింసించినా, కష్టపెట్టినా, నష్టపరిచినా, బాధించినా వారు శిక్షింపబడతారనే ఈ సన్నివేశాల సందేశం. అలా హింసింపబడే వారు స్త్రీలు కావచ్చు, పిల్లలు కావచ్చు. వృద్ధులు కావచ్చు. ఆఖరికి జంతువులు, పక్షులు కావచ్చు. కారణం అన్నీ భగవంతుని సృష్టిలోనివే, భగవంతుని రూపాలే కనుక.

దీనిని బట్టి మనం ఎవరిని బాధించకూడదు, వేటినీ హింసించకూడదు, రాక్షసుల్లా ప్రవర్తించకూడదు, దుష్ట కార్యాలు చెయ్యకూడదని తెలుసుకోవాలి. ఇది తెలుసుకోకుండా సృష్టి విరుద్ధమైన పనులు చేస్తే వాటి ఫలితం అనుభవించవలసి వస్తుందని, చివరకు కష్ట, నష్టాలకు గురి కావలసి వస్తుందన్నదే ఈ సన్నివేశాలలోని సందేశం.


అలాగే ఈ సృష్టిలో మంచివారు, సన్మార్గులు ఎప్పుడూ రక్షింపబడతారని తెలుసుకోవాలి. చాలా మంది తమకు ఎవరి వల్లనైనా హాని జరిగితే మాకు అన్యాయం జరిగిందని వాపోతారు. ఒక్కొక్కసారి దైవాన్ని కూడా నిందిస్తారు. కానీ ఈ సృష్టిలో సన్మార్గులు, ధర్మయుక్తంగా జీవించే వారు రక్షింపబడతారని భాగవతంలోని ఎన్నో సన్నివేశాల ద్వారా మనం తెలుసుకోవచ్చు. అందుచేత ఎవరైనా సరే దుష్టత్వాన్ని, రాక్షసత్వాన్ని వదలాలని, సన్మార్గాన్ని, ధర్మ మార్గాన్ని అనుసరించాలని తెలియ చెప&గిఓపడమే ఈ సన్నివేశాలన్నిటి సందేశం.

అంతేకాదు రక్షించేవాడు లేడు – మాకు రక్షణ లేదు అని అనుకోవలసిన పని లేదు. ఈ సృష్టిలో శిష్టులు అంటే మంచివారు ఎప్పుడూ రక్షింపబడతారు. దుష్టులు ఎప్పుడూ ఖచ్చితంగా శిక్షింపబడతారని శ్రీ కృష్ణ భగవానుడు భగవద్గీతలో ఈ శ్లోకం ద్వారా చాలా స్పష్టంగా చెప్పడం జరిగింది.

**శ్లో॥ పరిత్రాణాయ సాధూనాం, వినాశాయచదుష్కృతాం**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే! యుగే! (భ.గీ. )**

తా:– సాధువులను రక్షించడానికి, దుష్టులను శిక్షించటానికి అలా చేస్తూ లోకంలో ధర్మాన్ని స్థాపించడానికి మధ్య మధ్యలో నేను అవతరిస్తాను.

దీనిని బట్టి మనం రక్షింపబడేది పూజలు, ఆరాధనల వల్ల కాదు, మన ప్రవర్తనే మనల్ని రక్షిస్తుందని తెలుసుకోవాలి. బలహీనులను హింసిస్తూ, జంతువులను భక్షిస్తూ రాక్షసంగా ప్రవర్తిస్తే, ఎవరైనా దేవునిచే శిక్షింపబడతారు. అంటే కష్టాల పాలవుతారు అన్నదే ఈ సన్నివేశాలలోని సందేశం.



# శ్రీ కృష్ణుడు వెన్న, పాలు, పెరుగు దొంగిలించడం



శ్రీ కృష్ణుడు బాల్యంలో స్నేహితులతో కలిసి అందరి ఇళ్ళలోని వెన్న, పాలు, పెరుగు దొంగిలించేవాడని, అవి పంచుకుంటూ వారితో అల్లరి చేసేవాడని భాగవతంలో ఒక సన్నివేశం ద్వారా మనం తెలుసుకున్నాం. ఈ సన్నివేశానికి కూడా అంతరార్థం వుంది.

పాలు, పెరుగు, వెన్న, నెయ్యి, కోవా లాంటివి గోవుల పాల నుంచి లభించే పదార్థాలు. ఇవన్నీ మానవులకు ఎంతో ప్రశస్తమైన శుద్ధ సాత్వికమైన ఆహారం. అటువంటి ఆహారం ఎవరికైనా తెలివిని పెంచుతుంది. మనస్సును శుద్ధి చేస్తుంది. బుద్ధిని వికసింప చేస్తుంది. జ్ఞానాన్ని కలగచేస్తుంది. ఇంకా ఎన్నో రకాల లాభాలు కలుగ చేస్తుంది.

శ్రీ కృష్ణుడు వెన్న, పాలు, పెరుగు దొంగిలించేవాడు అంటే ఆయన వాటిని అంత ఇష్టపడేవాడని అర్థం. దొంగిలించేంత ఇష్టమని దాని అర్థం. వెన్నదొంగ అంటే వెన్నను అంత ఇష్టపడేవాడు అని అర్థం చేసుకోవాలి.

చూడండి పిల్లలు ఎవరికైనా ఏ స్వీటు ఇష్టమైనా, ఇష్టపడినా ఇతరులకు తెలియకుండా తీసుకుని తినేస్తూ వుంటారు. కారణం వారికి అంత ఇష్టం కనుక. అంతేకానీ నిజంగా దొంగిలించవలసిన అవసరం శ్రీ కృష్ణునికి వుందా? అంటే లేదు. కారణం ఆయన ఇంటిలోనే పాడి పుష్కలంగా వుండేది. వెన్నకు, పాలకు, పెరుగుకు లోటు లేదు. ఆయన తింటానంటే తల్లి యశోద కాదంటుందా? ప్రేమపూర్వకంగా ఎంత కావాలంటే అంత పెడుతుంది. అటువంటపుడు అందరి ఇళ్ళలోను వాటిని దొంగిలించవలసిన అవసరం ఆయనకు ఎందుకు వుంటుంది? తన దగ్గర లేకపోతేనే ఎవరైనా ఇతరుల నుంచి దొంగిలిస్తారు.

అందుచేత వెన్న, పాలు, పెరుగు దొంగిలించేవాడు అంటే వాటిని అంత ఇష్టపడేవాడు అని అర్థం చేసుకోవాలి. ఈ సన్నివేశంలోని సందేశం గ్రహిస్తే మనం కూడా శ్రీ కృష్ణునిలోని అటువంటి ఆహారం ఇష్టపడతాం. అటువంటి శుద్ధ సాత్వికమైన ఆహారాన్నే తీసుకుంటాం.

కానీ ఈ సన్నివేశం యొక్క సందేశం అర్థం చేసుకోకపోవడం వల్లే ప్రస్తుతం లోకంలో ప్రతి ఒక్కరూ తమో గుణ ప్రధానమైన, రజోగుణ ప్రధానమైన ఆహారాలు అంటే తామసిక, రాజసిక ఆహారాలు తీసుకుంటున్నారు, ఇష్టపడుతున్నారు. అంతేకానీ సాత్వికమైన ఆహారాలకు ఎవరూ ప్రాముఖ్యం ఇవ్వడం లేదు. మానవులు ఇంకా ఎలాంటి స్థితిలో వున్నారంటే అన్నిటికంటే నీచమైన 'నీచు'ను అంటే మృతాహారాన్ని అంటే శవాహారాన్ని అంటే మాంసాహారాన్ని ఇష్టపడుతున్నారు. నిత్యం భుజిస్తున్నారు.

కానీ నిజంగా ఈ సన్నివేశంలోని సందేశం అర్థం చేసుకుంటే ఎవరైనా మాంసాహారాన్ని ఇష్టపడరు. తినరు. సాత్విక ఆహారాన్నే ఇష్టపడతారు. శ్రీ కృష్ణుని ఆరాధించేవారైతే ఇది అర్థం చేసుకుని శ్రీ కృష్ణుడు ఇష్టపడే ఆహారాన్ని తాము ఇష్టపడతారు. అందుచేత ప్రతీ సన్నివేశంలోని అంతరార్థాన్ని తెలుసుకోవాలి.

అంతేకాదు శ్రీ కృష్ణుడు ప్రత్యేకించి గోవులను ఇష్టపడటానికి, గోవుల నుంచి వచ్చిన ఆహారం ఇష్టపడటానికి కారణం లేకపోలేదు. ఎందుచేతనంటే అన్ని జీవులు భగవత్ స్వరూపాలే. అన్ని జీవుల వల్ల ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా గానీ, మానవులకు ఏదో రకమైన ఉపకారం, లాభం వుంది. కానీ అన్నిటి కంటే గోవుకు ఒక ప్రత్యేక స్థానం వుంది. అందుకే హిందువులు గోవును ఆరాధిస్తారు. దైవంతో సమానంగా భావిస్తారు. కారణం గోవు నుంచి ఏది లభించినా అది మానవులకు ఉపకరించేవే. పాలనే తీసుకోండి. పాల నుంచి ఎన్ని రకాల పదార్థాలు లభిస్తున్నాయి. అంతేకాదు తల్లిపాలు సరిపోకపోతే బిడ్డకు ఆవుపాలే శ్రేష్టమని ఆవు పాలను పట్టిస్తారు. వేసవిలో పాల నుంచి లభించిన మజ్జిగ ఎంత చలవ చేస్తుంది? చల్లదనాన్ని కలగచేస్తుంది?

అంతేకాదు గోమూత్రంలో ఎన్నో ఔషధ గుణాలు వున్నాయి. ఆవు పేడ కూడా కళ్ళాపు జల్లుకుంటారు. శుభ్రంగా వుండటం కోసం ఇంటినే అలుకుతారు. పిడకలు చేసి వంట చెరకుగా ఉపయోగించుకుంటారు. అలా ఆవుకు మనం ఎంత మేత పెట్టినా అన్నీ ఉపయోగపడేవే ఇస్తుంది. వ్యర్థమన్నదే ఉండదు. ఇంక ఏ జంతువును చూసినా ఎంతో కొంత, ఏదో ఒకటి వ్యర్థం వుంటుంది. కానీ గోవు విషయంలో అలా కాదు. అందుచేత గోవు అంత గొప్పది.

అందుచేత అటువంటి గోవు నుంచి వచ్చిన పాలు, పాల పదార్థాల యొక్క విశిష్ఠతను తెలుసుకోండి, అటువంటి సాత్వికమైన ఆహారాన్ని ఇష్టపడండి, శుద్ధ సాత్వికమైన శాకాహారాన్ని తీసుకోండి. మాంసాహారాన్ని మానండి. ఇదే ఈ సన్నివేశం యొక్క అర్థం. అందుచేత శ్రీ కృష్ణునిలా **"ఇష్టపడవలసింది ఆవు పాలను, పాల పదార్థాలనే కానీ, ఆవు రక్త మాంసాలను కాదు"** ఇదే ఈ సన్నివేశంలోని సందేశం.



# శ్రీ కృష్ణుడు రోలు లాగడం



శ్రీ కృష్ణుడు ఇంట్లో వుండకుండా అక్కడికి, ఇక్కడికి వెళ్ళి అల్లరి చేస్తున్నాడని యశోద కృష్ణుణ్ణి ఎక్కడికి వెళ్ళకుండా వుండేందుకు ఒక రోలుకు కట్టేసింది. అపుడు శ్రీ కృష్ణుడు ఆ రోలునే లాక్కుంటూ బయటకు వెళ్ళాడు. అపుడు ఆ రోలు రెండు చెట్లకు తగులుకుంది. కృష్ణుడు గట్టిగా లాగేసరికి ఆ రెండు చెట్లు పడిపోయి ఇద్దరు

గంధర్వులు ప్రత్యక్షమై శ్రీ కృష్ణునికి నమస్కరించి మాకు శాపవిమోచనం కావించావని శ్రీ కృష్ణునికి కృతజ్ఞతలు తెలుపుకుని అదృశ్యమయ్యారు.

ఈ సన్నివేశంలోని అంతరార్థం చూద్దాం. ఆ గంధర్వులు శాపగ్రస్తుల య్యారు. అంటే చేసిన పాపానికి శిక్ష అనుభవిస్తున్నారని అర్థం. పాపం చెయ్యడమంటే తప్పు చెయ్యడం, చెట్లుగా మారారు అంటే చాలా పెద్ద శిక్ష అనుభవిస్తున్నారని అర్థం. అంటే అంత ఘోర తప్పిదం చేసారన్నమాట.

ఎందుచేతనంటే ఈ సృష్టిలో అన్నిటి కంటే ఖనిజ జాతి.. అంటే రాళ్ళు, రప్పలు తక్కువ జాతికి చెందినవి. కారణం అవి కదలవు, పెరగవు. దానికంటే ఉన్నతమైన జాతి వృక్షజాతి. కారణం వృక్షాలు, మొక్కలు, కదలగలవు, పెరగగలవు. వృక్షజాతి కంటే ఉన్నతమైన జాతి, జంతుజాతి కారణం జంతువులు కదలగలవు, తిరగగలవు, పెరగగలవు, అలాగే జంతుజాతి కంటే ఉన్నతమైన జాతి మానవ జాతి. కారణం మానవులు కదలగలరు, తిరగగలరు, పెరగగలరు. అంతేకాదు భూమి మీద ఏ జాతి చేయలేని పని చెయ్యగలరు, అంటే ఆలోచించగలరు. అటువంటి మానవ జాతి కంటే ఉన్నతమైన జాతి దేవతలు, యక్షులు, గంధర్వులు. కారణం వీరికి అతీంద్రియ జ్ఞానం వుంది. అతీంద్రియ శక్తులు కూడా వున్నాయి.

అటువంటి ఉన్నతమైన గంధర్వులు వృక్షాలులా పడి వున్నారంటే ఎంతటి ఘోరమైన శిక్ష అనుభవిస్తున్నారో ఆలోచించవచ్చు. ఈ సన్నివేశం యొక్క అర్థం అంతటి ఘోర శిక్ష అనుభవిస్తున్న వారికి కూడా శ్రీ కృష్ణుని స్పర్శతో అంటే సాంగత్యంతో విముక్తులయ్యారు. అంటే అంతటి కష్టాల నుంచి బయటపడ్డారు.


దీనిని బట్టి మనం అర్థం చేసుకోవలసింది శ్రీ కృష్ణుడు లాంటి మహాజ్ఞాని భూమి మీదకు రావడం వల్ల ఆయన సాంగత్యంతో ఎంతోమంది శాపగ్రస్తులు అంటే కష్టాలు అనుభవిస్తున్న వారు కూడా వారి కష్టాల నుండి బయట పడతారని తెలియ చెప్పడమే ఈ సన్నివేశం యొక్క అంతరార్థం.

చూడండి ప్రస్తుతం లోకంలో అందరూ ఇంచుమించు కష్టాలలోనే వున్నారు. కష్టాలు అంటే వారు గతంలో చేసిన పాపాలకు అనుభవిస్తున్న శిక్షలే తప్ప మరేమీ కాదు. కొంతమందికి చిన్న శిక్షలు, మరికొంతమందికి కఠిన శిక్షలు. అంటే కొంతమంది భరించగలిగిన కష్టాలు, మరికొంతమంది భరించలేని కష్టాలు అనుభవిస్తున్నారు. అలా కష్టాలు అనుభవిస్తున్నవారికి విముక్తి కలిగించడానికే అంతటి మహాజ్ఞాని, యోగీశ్వరుడైన శ్రీ కృష్ణభగవానుదు భూమి మీద అవతరించాడు. ఆయన వల్ల ఆయన సాంగత్యంతో కష్టాలు అనుభవించేవారు ఎంతోమంది కష్టాల నుంచి

విముక్తులు అవుతారు అంటే బయటపడతారని తెలియచెప్పే సన్నివేశమే ఇది.

ఈ సన్నివేశాన్ని బట్టి మనం అర్థం చేసుకోవలసింది. అంతటి మహాజ్ఞాని సాంగత్యం చేసినవారెవరైనా సరే కష్టాల నుంచి బయటపడతారని తెలుసుకోవాలి. మరి అంతటి మహానుభావుని సాంగత్యం ప్రస్తుతం మనకు సాధ్యం కాదు. కారణం ప్రస్తుతం ఆయన భూమి మీద లేడు. మరి మన కష్టాల నుంచి ఎలా బయటపడగలమనే సందేహం రావచ్చు. కానీ శ్రీ కృష్ణుని ప్రత్యక్ష సాంగత్యం చెయ్యలేకపోయినా ఆయన పరోక్ష సాంగత్యం చేసే అవకాశం మనకు వుంది. ఎందుచేతనంటే ఆయన అపారమైన జ్ఞానం భగవద్గీత ద్వారా మనకు అందించారు. మానవులు దుఃఖం నుంచి బయట పడటానికి చేసిన పాపాలు నుంచి విముక్తులు కావటానికి చక్కని మార్గం బోధించారు. ఆ జ్ఞానమార్గాన్ని అర్థం చేసుకుని, ఆచరించిన వారెవరైనా సరే ఆ దేవతలలాగే శాపవిముక్తులవుతారని, అంటే కష్టాల నుంచి బయట పడతారని, ఎంతటి ఘోరమైనా కష్టాలు అనుభవిస్తున్నవారైనా సరే, వాటి నుంచి విముక్తులవుతారని చెప్పడమే ఈ సన్నివేశం యొక్క సందేశం.

అక్కడ కనిపించే సన్నివేశం ప్రత్యక్ష సాంగత్యం. కానీ ఆయన గీతా సందేశాన్ని ఆచరించినట్లయితే, ప్రత్యక్ష సాంగత్యానికి అవకాశం లేకపోయినా శ్రీ కృష్ణునితో పరోక్ష సాంగత్యం చేసినట్టే. ఏదైనా ఆయన సాంగత్యమే. శ్రీ కృష్ణుని సాంగత్యంతో శాప విమోచనం అయ్యిందీ అంటే శిక్ష నుంచి బయటపడటమనే అర్థం. అంటే కష్టాల నుంచి బయటపడటమే. అందుచేత **"అద్భుతమైన శ్రీ కృష్ణభగవానుని గీతా బోధ అర్థం చేసుకుని ఆచరించండి. మీరు కూడా కష్టాల నుంచి విముక్తి పొందుతారు".** అదే ఈ సన్నివేశంలోని అంతరార్థం.



# శ్రీ కృష్ణుడు నోటిలో సమస్త లోకాలు చూపించడం



శ్రీ కృష్ణుడు ఒకసారి మట్టి తింటున్నాడు. అది బలరాముడు, గోపికలు చూసారు. మట్టి తింటున్నావా? అన్నారు. కృష్ణుడు లేదన్నాడు. అప్పుడు బలరాముడు, గోపికలు నువ్వు అబద్ధం చెబుతున్నావు. అమ్మ యశోదతో చెపుతాము వుండు అని వారు శ్రీ కృష్ణుని యశోద దగ్గరకు తీసుకుని వెళ్ళి, చూడమ్మా! యశోదమ్మా! శ్రీ

కృష్ణుడు మన్ను తింటున్నాడు అన్నారు. అపుడు యశోద నిజమేనా? అని అడిగింది. దానికి శ్రీ కృష్ణుడు లేదు అన్నాడు. అపుడు యశోద అయితే నోరు తెరు అంది. కారణం మట్టి తిన్నవారి నోటిలో మట్టి వుంటుంది కాబట్టి.

శ్రీ కృష్ణుడు నోరు తెరిచాడు. వెంటనే యశోదకు ఆశ్చర్యం కలిగింది. నిర్ఘాంత పోయింది. కారణం శ్రీ కృష్ణుని నోటిలో అంటే ఆయనలో సమస్త లోకాలు కనిపించాయి. కోటానుకోట్ల గ్రహాలు, ఎన్నో వింతలు, ఆశ్చర్యం గొలిపే దృశ్యాలు, సమస్త సృష్టి ఆమెకు కనిపించాయి. ఆమె అపుడు వీడు సామాన్యుడు కాడు అని తెలుసుకుంది. దగ్గరకు తీసుకుంది.

దీని అంతరార్థం తెలుసుకుందాం. భగవంతుడు అంటే చైతన్య శక్తి, సృష్టి అంతా వ్యాపించి వుంది. ఆయన నుంచే ఈ సృష్టి, సృష్టిలోని సమస్త లోకాలు ఉద్భవించాయి. ఈ సమస్త లోకాలనే 14 భువన భాండాలుగా యోగులు పేర్కొన్నారు. వీటినే 7 ఊర్ధ్వ లోకాలు 7 అధోలోకాలుగా పేర్కొన్నారు. అలా (1) భూలోకం, (2) భువర్లోకం (3) సువర్లోకం (4) జనాలోకం (5) మహాలోకం (6) తపోలోకం, (7) సత్యలోకం అనే ఊర్ధ్వ లోకాలు.

అలాగే (1) అతల (2) వితల (3) సుతల (4) రసాతల (5) మహాతల (6) తలాతల (7) పాతాళ లోకాలనే అధోలోకాలుగా పేర్కొన్నారు. అలాగే ఈ లోకాలలో ఎన్నో లక్షల జీవులు, జీవరాసులు ఆ భగవంతుని నుంచే అంటే చైతన్యం నుంచే ఉద్భవించాయి. అంటే అన్నీ ఆయనలోనే వున్నాయి. అలాగే భగవంతుడు తానే ఈ జీవులన్నిటిలో వుండి వాటికి చైతన్యం కలిగించి వాటిని తానే నడిపిస్తున్నాడు. గమనిస్తే **"భగవంతునిలో అన్నీ వున్నాయి. అలాగే అన్ని జీవులలో భగవంతుడు వున్నాడు"** అని అర్థమవుతుంది. అందుకే అంటారు. **"మనం సృష్టిలో వున్నాము, మనలో సృష్టి వుంది".** అంటే మనలోనూ సమస్తమూ వుంది అంటే సమస్త లోకాలు మనలోనే వున్నాయి అని అర్థం.


ఈ సత్యాన్ని లోకానికి తెలియచెప్పటానికే ఈ సన్నివేశం. అదే ఈ సన్నివేశంలోని అంతరార్థం. అంటే సమస్త లోకాలు బయట వుండటం కాదు. మనలోనూ వున్నాయన్నదే ఈ సన్నివేశ సందేశం.

ప్రస్తుతం మనం గమనిస్తే సృష్టి రహస్యాలు తెలుసుకోవటానికి మానవులు అంతరిక్షంలోకి రాకెట్ల ద్వారా ఇతర గ్రహాలకు ప్రయాణిస్తున్నారు. శక్తివంతమైన టెలిస్కోపులు ఉపయోగించి సృష్టి రహస్యాలు అన్వేషిస్తున్నారు. ఉపగ్రహాలు ప్రయోగించి సృష్టిలోని వింతలు, విశేషాలు తెలుసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు.

అలా మానవులు తమ మేధస్సును ఎంతగా ఉపయోగించి, ఎన్ని ప్రయాసలు పడినా, సృష్టిలోని చాలా అల్ప జ్ఞానమే పొందగలుగుతున్నారు. సృష్టి గురించి చాలా చాలా స్వల్పమే తెలుసుకోగలుగుతున్నారు. అలా నిరంతరం తరతరాలుగా కృషి చేస్తున్నారు. ఎన్నో లక్షల కోట్ల రూపాయలు అన్ని దేశాలు ఖర్చు చేస్తున్నాయి. కానీ ఎవరూ అంతకన్నా ఆలోచించడం లేదు.

కానీ భాగవతంలోని ఈ సన్నివేశం యొక్క అంతరార్థాన్ని తెలుసుకోగలిగితే అంటే సమస్త సృష్టి మనలోనే వుంది అన్న సత్యం అర్థం చేసుకోగలిగితే ఎవరైనా అలా ప్రయాసలు పడి బాహ్యంలోకి ప్రయాణం చెయ్యరు. తమలోనే అంటే అంతరంలోనికి ప్రయాణిస్తారు. కారణం అంతా, అన్నీ మనలోనే వున్నాయి కనుక. అందుచేత సృష్టి రహస్యాలు తెలుసుకోవాలన్నా, సృష్టిలోని లోకాల గురించి తెలుసుకోవాలన్నా ఎవరైనా సరే ఎవరికి వారు తమలోకి తాము పయనించవలసిందే అంటే అంతర్ముఖులు కావలసిందే అంటే సుభాష్ పత్రిగారు బోధించిన “శ్వాస మీద ధ్యాస ధ్యానం” చెయ్యవలసిందే.

తెలుసుకోండి కోటానుకోట్లు కర్చు పెట్టి సాధించలేనిది, కర్చు లేకుండా అంతర్ముఖులై ధ్యానం ద్వారా సాధించవచ్చని ఈ సన్నివేశంలోని సందేశం తెలుసుకుంటే మనకు స్పష్టంగా తెలుస్తుంది. మరొకసారి తెలుసుకోండి. శ్రీ కృష్ణునిలోనే కాదు సమస్త లోకాలు ప్రతి ఒక్కరిలోనూ వున్నాయి. అదే ఈ సన్నివేశం యొక్క అంతరార్థం. అంటే మనలో లేనిదంటూ లేదు. మనలోకి వెడితే అంటే ధ్యానం చేస్తే తెలుసుకోలేనిదంటూ వుండదు అన్నదే ఈ సన్నివేశ సందేశం. అందుకే యోగులంతా ధ్యానం చేసి సృష్టి రహస్యాలు తెలుసుకున్నారు.



# కాళిందుని పడగపై నాట్యం చెయ్యడం



అలాగే కాళిందుడు అనే పెద్ద పాము గోవులను, గోపాలురను చంపడం, వారిని మడుగులోకి లాగేయడం చేస్తూంటే శ్రీ కృష్ణుడు. ఆ పెద్ద పామును శిక్షించడమే కాదు, దాని పడగపై నాట్యం చేసి దాని గర్వాన్ని అణిచాడు. అప్పటి నుండి ఆ సర్పం వల్ల ఎవరికీ ఏ బాధ, ఏ ఇబ్బంది లేకుండా చేసాడు.


దీనిని బట్టి ఈ సృష్టిలో దుష్టులు శిక్షింపబడతారని అల్పులు, బలహీనులు రక్షింపబడతారని మనం తెలుసుకోవాలి. అదే ఈ సన్నివేశంలోని సందేశం.

దీనిని బట్టి ఈ సృష్టిలో ఎంతటి బలవంతులైనా, ఎంతటి ధనవంతులైనా, ఆఖరికి రాజులు, చక్రవర్తులైనా తమ బలం చూసుకుని, అధికార గర్వంతో విర్రవీగుతూ తాము ఏమి చేసినా ఎవరేమి చెయ్యగలరని భావిస్తూ సామాన్యులను, బలహీనులను, తమ కంటే తక్కువ వారిని వేధించినా, దౌర్జన్యం చేసినా, తమ స్వార్థం కోసం వారిని బాధించినా, తమకు అధికారం వుందని వారిని చంపినా, వారు ఎంతటి వారైనా ఈ సృష్టిలో శిక్షింపబడతారని వారి గర్వం అణచబడి కోరలు తీసిన పాములా చేయబడతారని, వారు కఠినంగా శిక్షింపబడతారని ఎంతటి వారైనా చివరకు మట్టికరవవలసిందేనని ఈ సన్నివేశం యొక్క సందేశం.

అలా మనం నాకు ఎదురు లేదు అని విర్రవీగే ఎంతో మంది నియంతలు, రాజులు, నాయకులు చివరకు అతిహీనంగా ప్రజల చేతిలోనే శిక్షింపబడటం, నాకు ఎదురులేదని చక్రం తిప్పిన రౌడీలు, గుండాలు రాజకీయ నాయకులు చివరకు చాలా దారుణంగా మరణించడం, చంపబడటం, జైలు పాలు కావడం కూడా చూస్తున్నాం. దీనిని బట్టి నాకు బలం వుందని విర్ర వీగే వారు ఎవరైనా చివరకు భంగపడవలసిందేనని ఈ సన్నివేశం ద్వారా తెలుసుకోవచ్చు. అందుచేత ఎవరైనా సరే తనకున్నది బలమే కావచ్చు, ధనమే కావచ్చు. అధికారమే కావచ్చు. పదవే కావచ్చు. గర్వించకూడదని, ఎవరినీ వేధించకూడదని తెలుసుకోవాలి. ఈ సృష్టిలో అందరూ సమానమేనని తెలుసుకోవాలి. అదే ఈ సన్నివేశంలోని సందేశం.



# శ్రీ కృష్ణుడు రాక్షసులను అవలీలగా సంహరించడం




భాగవతంలోని ఎన్నో సన్నివేశాలలో భగ వానుడు ఎంతోమంది రాక్షసులను అవలీలగా శిక్షిం చడం, సంహరించడం మనకు కనిపిస్తుంది. ఎంతో మంది రాక్షసులు, పరాజితులు కావడం కూడా మనకు కనిపిస్తుంది.

వీటి అర్థం లోకంలో అసుర శక్తి, దైవశక్తి అని రెండు రకాల శక్తులు వున్నాయి. లోకులను, లోకాన్ని నష్టపరిచి, కష్టాల పాలు చేసే వారిది అసుర శక్తి అంటారు. అలాగే ఉపకారం చేసి, ఆదుకునే వారిది, ఆనందపరిచే వారిది దైవశక్తి అంటారు. భాగవతంలోని సన్నివేశాలను బట్టి దైవ శక్తి ముందు అసుర శక్తి తలవంచవలసిందే అంటే ఓటమి పాలు కావలసిందేనని తెలుస్తుంది.

మనం ఎందులోనైనా ఎంతటి బలవంతులమైనా, ఎంతటి పేరు ప్రఖ్యాతులు వున్నా, ఎంతటి ఉన్నత పదవులు వున్నా రాక్షసుల్లా ప్రవర్తిస్తే ఓటమి పాలు కాక తప్పదని తెలుసుకోవాలి. ఇంతటి వాడిని, అంతటి వాడిని అని విర్రవీగకూడదు. అన్యాయంగా అక్రమంగా ప్రవర్తించకూడదు.

అలాగే మనం బలహీనులమైనా సరే, సామాన్యులమైనా సరే, ధర్మయుక్తంగా జీవిస్తూ, ధర్మాన్ని కాపాడుతూ అందరి మంచి కోసం పాటు పడుతుంటే ఎటువంటి వారి మీదనైనా మనదే పై చెయ్యి అవుతుంది. ఏ విషయంలోనైనా విజయం


సాధించవచ్చునని భాగవతంలోని పై సన్నివేశాల ద్వారా తెలుసుకోవచ్చు. వాటి సందేశం కూడా అదే.



అలా మనం భాగవతంలో ఎన్నో సన్నివేశాలు చూడవచ్చు. దైవశక్తి కలిగిన బాలుడైన భగవానుడు మహాబలశాలులైన, మాయాశక్తులు కలిగిన ఎంతోమంది రాక్షసుల ను సంహరించడం మనం తెలుసుకోవచ్చు. అక్కడ యుద్ధం బాలుడా? పూతన లాంటి, శకటాసురుడు లాంటి పెద్ద పెద్ద రాక్షసులా అన్నది కాదు. ధర్మానికి అధర్మానికి అంటే ధర్మయుక్తమైన దైవశక్తికి – అధర్మయుక్తమైన రాక్షస శక్తికి మధ్య జరిగిన యుద్ధం అని తెలుసుకోవాలి. సృష్టి విరుద్ధమైన పనులు చేసే వారు, వారు ఎంతటి బలవంతులైనా, ఎన్ని మాయాశక్తులు కలిగి వున్నా అంటే ఎన్ని కుతంత్రాలు చేసినా చివరకు నాశనం కావలసిందేనని ఆ సన్నివేశాల అంతరార్థం. ఈ సన్నివేశాల సందేశం తెలుసుకుని రాక్షసుల్లా ప్రవర్తించకండి. హింస చేయకండి. దేవతల్లా ప్రవర్తించండి. అంటే ధ్యానం చెయ్యండి. ఇదే పత్రీజీ ఇచ్చే సందేశం కూడా. ఆయన ఏం చెపుతారంటే "హింసా చోడో – హంసా పకడో" అంటే "హింస వదలాలి. అంటే మాంసం తినకూడదు – హంస అంటే శ్వాసను పట్టుకోవాలి అంటే ధ్యానం చెయ్యాలి". ఇదే పత్రీజీ సందేశం.



# గోపికల జలకాలాట
# శ్రీ కృష్ణునిచే వస్త్రాపహరణం



భాగవతంలోని మరొక సన్నివేశంలో గోపికలు బట్టలు గట్టు మీద వుంచి నదిలో జలకాలాడుతూంటారు. అపుడు శ్రీ కృష్ణుడు ఆ వస్త్రాలను చెట్టుమీద తన దగ్గర వుంచుకున్నాడు. గోపికలు నదిలో జలకాలాడి సరదా తీరగానే గట్టు మీద చూస్తే వారి వస్త్రాలు చెట్టు మీద శ్రీ కృష్ణుని వద్ద వున్నాయి.వారు సిగ్గుతో

వస్త్రాలను ఇమ్మని అర్థించగా శ్రీ కృష్ణుడు ఇవ్వలేదు. వారు చివరకు సిగ్గు విడిచి చేతులు రెండూ ఎత్తి జోడించి ప్రార్థిస్తేనే ఇచ్చాడు.

ఈ సన్నివేశం యొక్క అంతరార్థం చూద్దాం. శ్రీ కృష్ణుడు అంటే భగవంతుడు, గోపికలు అంటే మానవులు అని అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం మానవులు తమకు అవసరమైన సత్యం, ధర్మం, జ్ఞానం, అహింస, ప్రేమ, ఆనందం, శాంతి, జ్ఞానం, ధ్యానం లాంటి వస్త్రాలను వదలి ఈ ప్రపంచమనే నదిలో జలకాలాడుతున్నారు. అంటే ఈ లోకంలో ఇంద్రియ సుఖాలలో మునిగితేలుతున్నారు.

అంటే తినడం, త్రాగడం, నిద్రించడమే కాదు, విందులు, వినోదాలు, విలాసాలు, సరదాలు లాంటి వాటికి ప్రాముఖ్యం ఇస్తున్నారు. సంసారానికి, సంసార సుఖాలకు ప్రాముఖ్యం ఇస్తున్నారు. వాటి కోసం అధర్మంగా అక్రమ మార్గాలలో డబ్బు సంపాదిస్తున్నారు. కొన్నాళ్ళకు వీరి సరదా తీరిపోతుంది. అపుడు వీరికవసరమైన వస్త్రాలు, వీరు ధరించవలసిన, వీరికి కావలసిన సత్యం, ధర్మం, ప్రేమ, అహింస, శాంతి, ఆనందం, జ్ఞానం కోసం చూస్తే అవి చెట్టు మీద శ్రీ కృష్ణుని వద్ద వున్నట్టు ఎక్కడో భగవంతుని వద్ద వుంటాయి. కారణం అవన్నీ భగవంతుని సహజ గుణాలు. అవి లేకపోవడం వల్ల ఎన్ని సుఖాలు, భోగాలు వున్నా, ఎంత ధనం వున్నా మానవులు దుఃఖంతో బాధపడుతున్నారు.

ఆ వస్త్రాలు లేకపోతే గోపికలు నదిలోంచి ఎలా బయటకు రాలేరో! అలాగే మానవులు కూడా దుఃఖం నుంచి బయటపడలేరు. వస్త్రాలు ఇమ్మని శ్రీ కృష్ణుని గోపికలు అర్థించినట్టుగానే మానవులు శాంతి, ఆనందం ఇమ్మని భగవంతుని అర్థిస్తున్నారు, ప్రార్థిస్తున్నారు. రకరకాల ఆరాధనలు చేస్తున్నారు.

కానీ శ్రీ కృష్ణుడు వాటిని ఇవ్వలేదు. చేతులెత్తి అర్థించమన్నాడు. దీనికి కూడా అంతరార్థం వుంది. మానవులు వ్యర్థమైన ఆరాధనల ద్వారా వూరికే భగవంతుని ప్రార్థించినా, అర్థించినా వాటిని పొందలేరు. ఎందుచేతనంటే మానవులు ఎన్నో సంపాదించుకుని నేను బలవంతుణ్ణి, నేను పెద్ద ఉద్యోగిని, నేను ఎమ్మెల్యేను, నేను మంత్రిని, నేను అధికారిని, నేను భర్తను, నేను యజమానిని అని గర్విస్తున్నారు. ఆ గర్వంతో చేయకూడని పనులు చేస్తున్నారు. భగవంతుని, భగవంతుని ధర్మాలు విస్మరిస్తున్నారు. అలాగే ఇంకా ఎన్నో సంపాదించుకుని ఈ మేడ నాది, ఈ కారు నాది, ఈ భార్య నాది, ఈ పొలం నాది, ఈ ఐశ్వర్యం నాది అనుకుంటూ ఉండని వాటిని చూసుకుని పొంగిపోతున్నాడు. తాను

వచ్చేటప్పుడు వేటితోనూ రాలేదు. అలాగే వెళ్ళేటప్పుడు వేటినీ తీసుకు వెళ్ళలేడని, కారణం ఇవేమి తనవి కావని తెలుసుకోలేకపోతున్నాడు. ఎంతసేపూ వీటిని చూసి పొంగిపోతూ, చేయకూడని పనులు చెయ్యడం వల్ల కష్టాల పాలవుతున్నానని తెలుసుకోలేకపోతున్నాడు. ఇవేమీ లేవు, వున్నది భగవంతుడే అని తెలుసుకోలేకపోతున్నాడు. అందుకే తనకు కావలసిన శాంతి, ఆనందం అనే వస్త్రాలు పొందలేకపోతున్నానని తెలుసుకోలేకపోతున్నాడు. అందుచేత శాంతి, ఆనందం పొందాలంటే మానవులు నేను అనే అహంకారం, నాది అనే మమకారం వదలాలి. వారిలో అవి వున్నంత కాలం వాటిని పొందలేరు.

ఎప్పుడయితే మానవులు నేను అనే అహంకారం, నాది అనే మమకారం వదులుతారో వెంటనే గోపికలు శ్రీ కృష్ణుని నుంచి వస్త్రాలు పొందినట్టుగానే మానవులు భగవంతుని నుంచి ఆనందం, శాంతి, ధర్మం, జ్ఞానం, అహింస, ప్రేమ, ధ్యానం అనే వస్త్రాలు పొందగలరని చెప్పడమే దీనిలోని సందేశం.


తెలుసుకోండి మానవులు ఈ ప్రాపంచిక సుఖాలలో మునిగి తేలుతున్నంత కాలం సత్యం, ధర్మం, ప్రేమ, శాంతి, ఆనందం, జ్ఞానం, అహింస అనేవి పొందలేరు అన్నదే ఈ సన్నివేశ అంతరార్థం. అంటే దుఃఖం నుంచి బయట పడలేరు అన్నదే ఈ సన్నివేశ సందేశం.

అందుచేత మానవులు శాంతి, ఆనందం పొందాలంటే నేను అనే అహంకారాన్ని, నాది అనే మమకారాన్ని వదిలిపెట్టాలి. అదే చేతులెత్తి అడగమనటంలోని అంతరార్థం.

మరి నేను అనే అహంకారం, నాది అనే మమకారం ఎలా పోతాయి. ఈ రెండు మనస్సుకు సంబంధించినవి. అందుచేత మానవుడు ఈ ప్రాపంచిక సుఖాలను కొంత తగ్గించుకుని 'ధ్యానం' చేస్తే మెల్లిగా ఈ రెండు పోతాయి. శాశ్వత ఆనందం లభిస్తుంది.

ఈ సన్నివేశం యొక్క అంతరార్థం తెలియక, అజ్ఞానులైన వారు దీనిని వక్రీకరించడమే కాదు. విపరీత అర్థాలు తీస్తూ భగవంతుని అవమానిస్తున్నారు. అందుచేత పురాణాలలోని ప్రతీ సన్నివేశంలో ఒక అంతరార్థం దాగి వుందని తెలుసుకోవాలి. వాటి ద్వారా లోకానికి ఒక సందేశం ఇవ్వబడిందని అర్థం చేసుకోవాలి. ఆ సందేశాన్ని అర్థం చేసుకుని ఆచరణలో పెట్టాలి. అలా ఆచరణలో పెట్టిన వారి జీవితమే ధన్యమవుతుంది.

# శ్రీ కృష్ణుడు గోపికలతో క్రీడించడం



శ్రీ కృష్ణుడు 16వేల మంది గోపికలతో క్రీడించేవాడని, నృత్యం చేసేవాడని, అంతమంది గోపికలు ఆయనంటే ఇష్టపడే వారని, వారెప్పుడూ ఆయనతోటే వుండేవారని, వారిని శ్రీ కృష్ణుడు తన వేణుగానంతో మైమరపించే వాడని భాగవతంలో చెప్పబడింది. గోపికలతో శ్రీ కృష్ణుడు నృత్యం చెయ్యడం, ఆటలాడటం లాంటి సన్నివేశాలు మనం చూస్తూ వుంటాం కూడా. కానీ వీటన్నిటికి అంతరార్థం వుంది.

ఇక్కడ గోపికలు అంటే ప్రజలు అని అర్థం. 16 వేల మంది అని అనటానికి కారణం. అప్పుడు భూమి మీద జనాభా ఇప్పటిలా వందల కోట్లలో లేదు. అందుచేత అపుడు వున్న జనాభాలో అంత ఎక్కువ మంది ఆయనను అభిమానించేవారని చెప్పడమే దాని అంతరార్థం. అంతమంది ప్రియురాళ్ళు వున్నారంటే ఆయనను అంత ఎక్కువ మంది ప్రజలు ఇష్టపడేవారని అర్థం.

ఇక్కడ శ్రీ కృష్ణుడు అంటే మనమంతా వూహించే రూపం కాదు. "ఆత్మ" అని అర్థం చేసుకోవాలి. ఆయన అందరితో వుండేవాడు, అంటే ఆత్మ అందరితోనేగా వుండేది.

శ్రీ కృష్ణుడు తన వేణుగానంతో వారందరినీ మైమరిపించేవాడు. అంటే తన వేణుగాన మాధుర్యంతో ధ్యానంలో వారందరినీ అంతులేని ఆనంద స్థితికి తీసుకు వెళ్ళేవాడు అని అర్థం.

వారంతా ఆయనతోనే వుండే వారంటే ధ్యానంలో వారికి ఇంకొక ఆలోచన ఇంకొకరి గురించి తపన వుండేది కాదు. అంటే ధ్యానంలో ఆలోచనలు లేని స్థితిలో ఆత్మతో వుండేవారని, అంటే ధ్యానం చేసేవారనే దానిలోని అంతరార్థం.

అంతేకాదు గోపికలు ఎంతసేపూ శ్రీ కృష్ణుని గురించిన ఆలోచనలు చేస్తూ, ఆయన చెప్పిన మాటలు తలచుకుంటూ వుండేవారంటే అర్థం. అప్పటి ప్రజలు ఎంతసేపూ ఆత్మకు సంబంధించిన విషయాలు చర్చించుకుంటూ ఆత్మ జ్ఞానాన్ని చెప్పుకుంటూ, అదే ప్రస్తావనతో వుండేవారని అర్థం.

ఆయన వారందరితో రమించేవాడు, క్రీడించేవాడు అంటే ఎవరికి వారు ధ్యానంలో మానసిక స్థితిని దాటి, ఆత్మస్థితిలో, ఆత్మతోనే వుండేవారు, ఆత్మతోనే రమించేవారని అర్థం. ఆత్మతో వుండటమే ఆయనతో వుండటం. అంటే అందరూ ఎప్పుడూ ధ్యానంలో వుండేవారని, ధ్యానం చేసేవారని ఈ సన్నివేశం యొక్క అంతరార్థం. అంటే అప్పటి ప్రజలు కాసేపు ఈ ప్రపంచాన్ని, సంసారాన్ని, భర్తలను, భార్యలను మరచిపోయి ధ్యానంలో ఆత్మతో అంటే శ్రీ కృష్ణునితో వుండేవారని అర్థం.

అంతేకానీ అంతమంది స్త్రీలతో సెక్సు జరిపేవాడని కాదు. మూర్ఖ మానవులు, అజ్ఞానపు మానవులు విపరీత అర్థాలు తీసుకుని అసలు సత్యాన్ని మరచి వక్రీకరించడమే పనిగా పెట్టుకుంటారు.

జీవితంలో మనం కోరుకునేది ఆనందమే కదా! ఆనందం ఎక్కడ లభిస్తుంది? భగవంతుని దగ్గర భగవంతుడు ఎవరు? 'ఆత్మ'. అందుచేత మనం భగవంతునితో అంటే ఆత్మతో వుండడానికి ప్రయత్నించాలి. అంటే ధ్యానం చెయ్యాలి. గోపికలు శ్రీ కృష్ణునితో వుండటానికి ప్రయత్నించేవారని చెప్పడంలోని అర్థం ఇదే. ఇది తెలియచెప్పడానికే, అంటే ధ్యానం చెయ్యాలన్నదే అందులోని అంతరార్థం.

ఎంతమంది శ్రీకృష్ణునితో వుండటానికి ప్రయత్నిస్తే అంతమందితోటే ఆయన వుంటాడు. అంటే ఎంతమంది ధ్యానం చేస్తే అంతమంది ఆత్మతో వున్నట్టే కదా? అందుచేత శ్రీ కృష్ణుని ఆత్మగా భావించిన వారు ఇది అర్థం చేసుకుంటారు. దేహంగా భావించేవారు అపార్థం చేసుకుంటారు. అంతా మనకి వున్న జ్ఞానాన్ని బట్టే వుంటుంది, అర్థమవుతుంది.

అలాగే బ్రహ్మర్షి పత్రిగారికి కూడా ప్రస్తుతం ఎన్నో లక్షల మంది గోపికలు వున్నారు. అంటే ధ్యానులు వున్నారు. ఆయన వేణుగానంతో ఎన్నో లక్షల మంది ధ్యానంలో ఆత్మతో వుండి అసలైన ఆనందంలో ఓలలాడుతున్నారు. దీనిని బట్టి గోపికలలా మనం కూడా ధ్యానం చేసి ఆనందం పొందాలన్నదే ఈ సన్నివేశ సందేశం.

# శ్రీ కృష్ణుడు గోవులను కాయడం



శ్రీ కృష్ణుడు గోవులను కాసేవాడు, వాటిని ప్రేమించేవాడు, వాటితో స్నేహం చేసేవాడు అంటే అర్థం. ఆయన సకల జీవులను అంటే సమస్త జంతువులను ప్రేమించేవాడని, వాటితో స్నేహం చేసేవాడని అర్థం.

ఆయనకు మానవులే కాదు సకల జీవులు సమానమే. కారణం అన్నీ ఆయన రూపాలే కాబట్టి. అన్నీ ఆయనే కాబట్టి. అందుచేత అన్నిటినీ రక్షించేవాడు, ప్రేమించేవాడు అని చెప్పడమే ఈ సన్నివేశంలోని అర్థం. అలాగే మనం కూడా అన్ని జీవులను, జంతువులను ప్రేమించాలని తెలుసుకోవాలి. అన్నిటితో స్నేహం చెయ్యాలి, అలా స్నేహ ధర్మాన్ని పాటించాలని చెప్పడమే ఈ సన్నివేశ సందేశం.

గోపాలుడు అనగానే గోవులను కాచేవాడు అని అనుకుంటాం. అంటే ఆవులకు మేతమేపేవాడు అని భావిస్తాం. కానీ గోపాలునికి ఇంకొక అర్థం కూడా వుంది.

గో అంటే ఇంద్రియాలు అని అర్థం. గోపాలుడు అంటే ఇంద్రియాలను పాలించే వాడు అని అర్థం. అంటే ఇంద్రియాలను అదుపులో వుంచుకున్నవాడు అని కూడా అర్థం వుంది.

అందుచేత ఎవరు తమ ఇంద్రియాలను అదుపులో వుంచుకోగలుగుతారో వారంతా గోపాలురే. అంటే మనమంతా గోపాలురవ్వాలి. అంటే మన ఇంద్రియాలను అదుపులో వుంచుకోవాలి. అలా ఇంద్రియాలను అదుపులో వుంచుకున్నవారు మొత్తం


జీవితాన్ని అదుపులో వుంచుకున్నవారవుతారు.


మరి ఇంద్రియాలను అదుపులో వుంచుకోవాలంటే మనస్సును అదుపు చెయ్యాలి. కారణం ఇంద్రియాలన్నీ మనస్సు అదుపులో వుంటాయి కాబట్టి. మనస్సు అదుపులో వుండాలంటే ధ్యానం చెయ్యాలి. ఎవరైతే ధ్యానం చేస్తారో వారు తమ ఇంద్రియాలపై పూర్తి ఆధిపత్యం కలిగివుంటారు. అలాంటి వారంతా గోపాలురే!

శ్రీ కృష్ణుడు గోవులను అదుపు చేసినట్లు మన ఇంద్రియాలను అదుపు చెయ్యాలని చెప్పడమే ఆ సన్నివేశం యొక్క అంతరార్థం. అదే మనకు ఇవ్వబడిన సందేశం. అందుచేత ధ్యానం చెయ్యండి. గోపాలురవ్వండి.









# శ్రీ కృష్ణుడు గోవర్ధనగిరి ఎత్తడం




ఇంద్రుడు ద్వారకవాసులైన యాదవుల మీద కోపించి, వారి మీద రాళ్ళ వర్షం కురిపించసాగాడు. అపుడు శ్రీ కృష్ణుడు తన చిటికెన వేలు మీద గోవర్ధన గిరి పర్వతాన్ని ఎత్తి ద్వారకా వాసులను, గోవులను సమస్త జీవరాశిని, అందరినీ రాళ్ళ వర్షం నుండి కాపాడాడు. చివరకు ఇంద్రుడు భంగపడ్డాడు.

ఈ సన్నివేశం యొక్క అంతరార్థం లోక కళ్యాణకరమైన పనులు చేసే వారు, ధర్మాన్ని కాపాడేవారు, ఎంతటి కార్యమైనా అవలీలగా చేయగలరని, వారికి ఒక పర్వతాన్ని చిటికెన వేలుతో ఎత్తడమంత తేలికైన విషయమని తెలుసుకోవాలి. ఏ పనినైనా, ఏ కార్యమైనా, అది ఎంతటి గొప్పదైనా, ఆ పనిని వారు అతి సునాయాసంగా చెయ్యగలరని ఈ సన్నివేశ అంతరార్థం. అలాంటి వారు చేసే పనులకు ఎన్ని అవరోధాలు ఎదురైనా, ఎంత మంది ఎన్ని అవరోధాలు కల్పించినా వారిని ఏమీ చెయ్యలేరని, వారు చేపట్టిన కార్యం ఆగదని ఈ సన్నివేశం యొక్క అంతరార్థం. ఈ సన్నివేశంలో ఇంద్రుడు రాళ్ళ వర్షం కురిపించి ఎన్నో ఇబ్బందులు కల్పించాడు. ఎన్ని చేసినా ఇంద్రుడు శ్రీ కృష్ణుని కానీ, ఆయనను ఆశ్రయించిన

వారిని కానీ ఏమీ చేయలేకపోయాడు. చివరకు భంగపడ్డాడు.


అందుచేత తెలుసుకోండి లోక కళ్యాణకరమైన పనులు చేసే వారికి, ధర్మాన్ని కాపాడే వారికి ఎలాంటి కార్యమైనా, ఎంతటి పెద్ద కార్యమైనా వారికి చిటికెన వేలుతో పర్వతం ఎత్తడమంత సులువు, అంత తేలిక అని తెలుసుకోవాలి. అలాంటి వారిని ఆశ్రయించిన వారికి కూడా ఎవరూ ఎలాంటి హాని చెయ్యలేరని తెలుసుకోవాలి. వారికి ఏ కష్టనష్టాలు కలగవని తెలుసుకోవాలి.


ఈ విషయం మనం బ్రహ్మర్షి పత్రి గారిని గమనిస్తే మనకు తెలుస్తుంది. ఆయన కూడా లోకంలో శాంతిని స్థాపించడానికి, హింస లేకుండా చెయ్యడానికి మానవులు సకల సమస్యల నుంచి బయటపడే ధ్యాన మార్గాన్ని ప్రపంచంలోని ప్రతి ఒక్కరికి అందించడానికి, జీవులపై జరిగే హింసను ఆపడానికి, సృష్టి ధర్మాలను అందరికీ తెలియచెయ్యటానికి, ఎంతో కృషి చేస్తున్నారు. ఆయన ఎవరూ వూహించలేనంత గొప్ప కార్యాలు తలపెడు తున్నారు. సామాన్యులు ఆశ్చర్యపోయేడంతటి ధ్యాన యజ్ఞాలు, పిరమిడ్ నిర్మాణాలు లాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. అలా ధర్మం స్థాపించడానికి విశేషమైన కృషి చేస్తున్నారు.

పత్రీజీ ఏ కార్యం తలపెట్టినా, ఎంతటి గొప్పకార్యం తలపెట్టినా, చాలా సునాయాసంగా పూర్తి చెయ్యగలుగు తున్నారు. ఆ కార్యం చేసేటపుడు ఎన్నో అవరోధాలు ఎదురవుతున్నాయి. ఎన్ని ఎదురైనా, అవి వారిని కానీ, వారిని ఆశ్రయించిన వారిని కానీ ఏమీ చేయలేకపోతున్నాయన్నది మనం, ప్రస్తుతం పత్రిగారిని గమనిస్తే తెలుసుకోవచ్చు.

ఆయన చేతిలో రూపాయి లేకపోయినా లోక కళ్యాణం కోసం ఎన్నో పెద్ద పెద్ద ప్రాజెక్టులు, పెద్ద, పెద్ద పిరమిడ్‌లు నిర్మిస్తున్నారు. ఎన్నో లక్షల మందితో ధ్యాన యజ్ఞాలు నిర్వహిస్తున్నారు. అవి నిర్మించేటపుడు, అలాంటి కార్యక్రమాలు నిర్వహించేటపుడు, కొంతమంది వల్ల ఆయనకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఆయన ఎన్నో అవరోధాలు ఎదుర్కోవలసివస్తుంది. కానీ వాటినన్నిటిని ఆయన శ్రీ కృష్ణుడు చిటికెన వేలుతో గోవర్ధనగిరి పర్వతాన్ని ఎత్తినంత సునాయాసంగా పరిష్కరిస్తున్నారు, అధిగమిస్తున్నారు. పత్రిగారిని గమనిస్తే ఈ సన్నివేశంలోని సందేశం మనకు అర్థమవుతుంది. అందుచేత మనం కూడా ధర్మంగా జీవిద్దాం. ధర్మాన్ని కాపాడుదాం.

# శ్రీ కృష్ణుడు చాణూర - ముష్టికులనే మల్లులను ఓడించడం మదపుటేనుగును నేలకూల్చడం





శ్రీ కృష్ణ బలరాములు, రాక్షసరాజైన కంసుని చంపి ధర్మాన్ని స్థాపించే ప్రయత్నంలో కంసుని కోటలో ప్రవేశించారు. వారిని కంసుడు తన రాజప్రాసాదంలోకి రానివ్వకుండా చెయ్యడానికి, వారిని చంపడానికి అపార బలసంపన్నులైన చాణూర, ముష్టికలనే మల్లయుద్ధవీరులను ప్రయోగించాడు. కానీ వారిని శ్రీ కృష్ణ బలరాములు అవలీలగా ఓడించగలిగారు.

అలాగే మత్తెక్కిన మదగజాన్ని కూడా బలరామకృష్ణుల మీద ప్రయోగించాడు. కానీ ఆ మద గజాన్ని కూడా శ్రీ కృష్ణుడు నేలకూల్చాడు.

అంటే దీని అర్థం లోకంలో ధర్మాన్ని కాపాడే ప్రయత్నం చేసే వారికి ఎన్నో అవరోధాలు ఎదురవుతాయి. ఎన్నో కష్టాలు ఎదుర్కొనవలసివస్తుంది. కానీ అవి ఎలాంటివైనా, ఎంతటి బలవత్తరమైనవైనా వాటన్నిటినీ వారు అతి సునాయాసంగా అంటే చాలా తేలికగా అధిగమించగలరని తెలియచెప్పడమే ఈ సన్నివేశాల అంతరార్థం.

అందుచేత మనం కూడా ధర్మాన్ని అనుసరించాలని, ధర్మాన్ని కాపాడే ప్రయత్నం చెయ్యాలని, అపుడు మన జీవితంలో కూడా ఎన్ని అవరోధాలు ఎదురైనా, ఎన్ని కష్టాలు వచ్చినా మనం కూడా తేలికగా అధిగమించగలుగుతామని తెలియ చెప్పడమే ఈ సన్నివేశాల సందేశం.

# కంసుని సంహరించడం



రాక్షసగుణాలు కలిగిన రాజైన కంసుడు ఎన్ని పన్నాగాలు పన్నినా, ఎన్ని జిత్తులు ప్రదర్శించినా, ఎన్ని మాయోపాయాలు చేసినా చివరకు శ్రీ కృష్ణుడు కంసుణ్ణి సంహరించడం జరిగింది. దీనిలో కూడా అంతరార్థం వుంది.

కంసుడు శ్రీ కృష్ణునికి దగ్గర బంధువు. స్వయంగా మేనమామ అయినా సరే శ్రీ కృష్ణుడు శిక్షించాడు. దీనిలోని సందేశమేమిటంటే భగవంతునికి రాగద్వేషాలు వుండవని ఆయనకు అందరూ సమానమని, ఆయనకు తనవారని, దగ్గరివారని అనురాగము, ఇతరులని ద్వేషం వుండదని, మనం తెలుసుకోవచ్చు. అంతేకాదు వారు ఎలాంటి వారైనా, తప్పులు చేస్తే, రాక్షసంగా ప్రవర్తిస్తే, ధర్మాన్ని తప్పితే, శిక్షింపబడతారని కూడా తెలుసుకోవచ్చు.

ఎందుచేతనంటే చాలా మంది శ్రీ కృష్ణుని బొమ్మకు పూజలు చేస్తూ, భజనలు


చేస్తూ తాము శ్రీ కృష్ణ భగవానునికి దగ్గరైపోయినట్టు భావిస్తారు. అలాగే నామాలు పెట్టుకుని, వుంగరాలు ధరించి, తాను కృష్ణునికి ఇష్టుడైపోయినట్టుగా భావిస్తారు. అంతేకాదు తాను హిందువును కాబట్టి తానంటే శ్రీ కృష్ణుడు ఇష్టపడతాడని భావిస్తారు. అలా భావిస్తూ... చేయకూడని పనులు చేస్తూ... తాను శ్రీ కృష్ణునికి ఇష్టులైపోయినట్టు భావిస్తారు. తాము ఎలా ప్రవర్తించినా పూజలు, భజనలు, పారాయణలు చేస్తున్నాము కాబట్టి ఆయన మమ్మల్ని రక్షిస్తాడని, ఆయన మమ్మల్ని ఏమీ చెయ్యడని అనుకుంటారు.

కానీ పై సన్నివేశాన్ని బట్టి భగవానునికి అందరూ సమానమని తెలుసుకోవాలి. వారు హిందువైనా సరే, ఎన్ని పూజలు చేసినా, ప్రార్థనలు, భజనలు చేసినా, దుర్మార్గంగా, రాక్షసంగా ప్రవర్తిస్తే అంటే ఇతరులను, ఇతర జీవులను హింసించి, ధర్మ విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠినంగా శిక్షింపబడతారని తెలుసుకోవాలి. కానీ వారు హిందువులు కాకపోయినా, పూజలు చెయ్యకపోయినా, భజనలు చేయకపోయినా, ప్రార్థనలు చెయ్యకపోయినా, హారతులు ఇవ్వకపోయినా, నామాలు, బొట్లు, విబూదులు ధరించికపోయినా, తాళ్ళు, ఉంగరాలు ధరించకపోయినా... వారే కనుక అహింసను పాటిస్తూ, న్యాయంగా, ధర్మంగా ప్రవర్తిస్తే, మంచి చేస్తుంటే వారు తప్పకుండా రక్షింపబడతారని తెలియ చెప్పడమే ఈ సన్నివేశంలోని అంతరార్థం.

అందుచేత భగవంతునికి అందరూ ఒక్కటేనని తెలుసుకోవాలి. ఆయనకు స్వపర బేధం లేదు, రాగద్వేషాలు లేవు. కారణం అన్నీ, అందరూ ఆయన రూపాలే కనుక. అంతేకానీ తాను హిందువుననుకుంటూ, పూజలు చేస్తున్నానను కుంటూ తప్పులు, పాపాలు చేస్తే శిక్ష తప్పదు. అంటే కష్టాలు తప్పవని తెలుసుకోవాలి. అదే యీ సన్నివేశంలోని అంతరార్థం. మనం అలా ప్రవర్తించకూడదని చెప్పడమే దానిలోని సందేశం.



# శిశుపాలుని 100 తప్పులు క్షమించడం



శ్రీ కృష్ణ భగవానుడు శిశుపాలుడు ఎన్ని తప్పులు చేసినా వూరుకున్నాడు. అలా 100 తప్పులు వరకు క్షమించాడు. కానీ 100 తప్పులు చేయగానే వూరుకోలేదు. శిశుపాలుని శిక్షించాడు. శిరస్సును ఖండించాడు.

ఈ సన్నివేశం యొక్క అర్థమేమిటంటే ఈ సృష్టిలో ఒక ధర్మ సూక్ష్మం

వుంది. అదేమిటంటే! **"ఎవరికైనా పాపం చేసిన వెంటనే కష్టం రాదు అంటే శిక్ష పడదు. పాపం పండితేనే శిక్షపడుతుంది అంటే కష్టం వస్తుంది".**

పాపం అంటే సృష్టి విరుద్ధమైన, ధర్మ విరుద్ధమైన కర్మలే పాపం అంటారు. గుర్తుంచుకోండి, మనమంతా ఈ సృష్టిలో వున్నాం. అలాగే ఈ సృష్టిని సృష్టి చేసిన సృష్టి కర్త కూడా వున్నాడు. ఆయననే అందరూ రకరకాల పేర్లతో పిలుస్తారు. ముస్లింలు 'అల్లా' అంటారు. క్రిష్టియన్లు 'తండ్రి' అంటారు. హిందువులు భగవంతుడు, పరమాత్మ, పరబ్రహ్మ, ఆదిశక్తి, పరాశక్తి, పరమేశ్వరుడు, విశ్వాత్మ, లలితాదేవి ఇలా రకరకాల పేర్లతో పిలుస్తారు.

అంతేకాదు ఆ భగవంతుడు తన సృష్టిలో తనచే సృష్టింపబడిన సమస్త జీవులు అంటే మానవులు, జంతువులతో సహా అంతా ఆనందంగా, సుఖశాంతులతో జీవించడానికి, ఎవరూ ఎవరినీ హింసించకుండా, భాధించకుండా వుండటానికి, నష్ట పరచకుండా, కష్ట పెట్టకుండా వుండటానికి ఆయన ఈ సృష్టిలో కొన్ని నియమాలు ఏర్పాటు చేసాడు. ఆ నియమాలనే 'ధర్మాలు' అన్నారు.

అలా ఎవరైనా ఆ నియమాలు ఉల్లంఘించినా! అంటే ధర్మం అతిక్రమించినా! అంటే సృష్టి విరుద్ధంగా ప్రవర్తించినా! అంటే తమ వల్ల ఈ సృష్టిలోని ఇతర జీవులకు, ప్రాణులకు కష్టం, నష్టం కలిగించినా! వారికి సృష్టి ధర్మ సూక్ష్మాల ప్రకారం శిక్షలు పడతాయని తెలుసుకోవాలి. ఆ శిక్షలనే మనం కష్టాలు అంటాం. గుర్తుంచుకోండి, "మనకు కష్టాలు వచ్చాయి అంటే ఈ సృష్టి నియమాలననుసరించి శిక్షలు పడ్డాయి అని అర్థం" ఆలోచించండి మనకు కష్టం ఎందుకు వచ్చింది? అంటే మనం ఎవరినో హింసించామని, భాధించామనే అర్థం. సృష్టి ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించామనే అర్థం.

తెలుసుకోండి ఏ కష్టమైనా, అనారోగ్యమైనా, సమస్య అయినా, పాపం చేసిన వెంటనే రాదు. ఏదైనా సృష్టి యొక్క మరొక ధర్మ సూక్ష్మం ప్రకారం వస్తాయి. దానినే పాపం పండింది అంటారు. ఎందుచేతనంటే ఈ సృష్టిలో **"పాపం చేసిన వెంటనే శిక్ష పడదు. పాపం పండితేనే శిక్ష పడుతుంది".** కారణం తప్పు చేసిన ప్రతి ఒక్కరికి అవకాశం ఇవ్వబడుతుంది. కారణం తన తప్పును తెలుసుకుంటాడని, తప్పును సరి చేసుకుంటాడని, కానీ ఎవరైనా తన తప్పు తెలుసుకోకుండా ఆ తప్పును మానకుండా... మరల, మరల చేస్తుంటే, తన ప్రవర్తన మార్చుకోకపోతే! అతని తప్పును అతనికి తెలియ పరచటానికి, అతని ప్రవర్తనలో మార్పు తీసుకురావటానికి తగిన శిక్ష వేయబడుతుంది. అంటే తప్పులు చేయడానికి,

హింస చేయడానికి కూడా పరిమితి వుంటుంది. ఆ పరిమితి దాటడాన్నే 'పాపం పండింది' అంటారు.

ఈ విషయాన్నే శిశుపాలుని సన్నివేశం ద్వారా లోకానికి తెలియచెయ్యడం జరిగింది. శిశుపాలుడు భగవానుని దూషించి అవమానించాడు. కానీ భగవానుడు ఏమీ చెయ్యలేదు. కారణం అది మొదటి తప్పు కనుక. కానీ శిశుపాలుడు ఇది తెలుసుకోలేదు సరికదా! విర్రవీగాడు. శ్రీ కృష్ణుడు ఏం చెయ్యగలడు అనుకున్నాడు. మరల, మరల దూషించాడు, అవమానించాడు. కానీ భగవానుడు ఏమీ మాట్లాడలేదు. ఏమీ చెయ్యలేదు. ఓపిక పట్టాడు. శిశుపాలుడు ఇంకా రెచ్చిపోయాడు. నన్ను ఎవరూ ఏమి చెయ్యగలరు అనుకున్నాడు, నేనే గొప్ప వాడిననుకున్నాడు. నేను ఏమి చేసినా ఫరవాలేదనుకున్నాడు, నా ఇష్టం అనుకున్నాడు. అలా భగవానుణ్ణి దూషిస్తూ తప్పు మీద తప్పు చేస్తూనే వున్నాడు. అలా 99 తప్పులు వరకు భగవానుడు వూరుకున్నాడు. సహించాడు. ఇది శిశుపాలుడు గ్రహించలేదు. అలా 100వ తప్పు కూడా చేశాడు. ఇక భగవానుడు వూరుకోలేదు. ఇచ్చిన అవకాశం శిశుపాలుడు సద్వినియోగం చేసుకోలేదు. వాడికి బుద్ధి చెప్పడానికి వాడి తప్పు వాడికి తెలియచెయ్యడానికి వెంటనే శిక్షించాడు. వాడి శిరస్సు ఖండించాడు.

భగవానుడు 100 తప్పుల వరకు వూరుకున్నాడు అంటే అవకాశం ఇచ్చాడు అని అర్థం. అంటే అప్పటి వరకు వాడి 'పాపం పండలేదని' అర్థం. మరి 100 తప్పులకు శిక్షించాడు అంటే ఇచ్చిన అవకాశం కోల్పోయాడు అంటే 'పాపం పండిందని' అర్థం. అంటే వాడు క్షమకు అర్హుడు కాదు, శిక్షకు అర్హుడు అయ్యాడు.

ఈ సన్నివేశం యొక్క అర్థం, ఎవరైనా పాప కర్మలు కొంతవరకే, కొంతకాలమే చెయ్యగలరు. ఎంత వరకు అంటే పాపం పండేంతవరకు. పాపం పండితే ఈ సృష్టిలో వారు ఎవ్వరైనా, ఎంత గొప్పవారైనా వారు ధనవంతులు కానివ్వండి, మంత్రులు కానివ్వండి, ఎంతటి ఉన్నత స్థితిలో వున్న వారైనా కూడా శిక్ష అనుభవించవలసిందే. శిక్షకు పాత్రులు కావలసిందే. అంటే కష్టాలు పాలు కావలసిందే. ఇదే ఈ సన్నివేశం యొక్క అంతరార్థం. సందేశం కూడా.

చూడండి చాలా మంది తమ బలం చూసుకుని, బలం అంటే శారీరక బలమైనా కావచ్చు. ధనబలమైనా కావచ్చు, అధికార బలమైనా కావచ్చు, పదవీ బలమైనా కావచ్చు, తెలివిలో బలమైనా కావచ్చు, అది చూసుకుని, గర్వంతో, అహంకారంతో తమ క్రింది వారిని వేధించినా, మోసగించినా, బాధించినా తమ క్రింది జీవులను అంటే జంతువులను హింసించినా, చంపినా, చంపి వాటి మాంసాన్ని

భక్షించినా, అంటే అలా సృష్టి ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించినా, వారంతా సృష్టి ధర్మం ప్రకారం శిక్షింపబడతారు, అంటే కష్టాల పాలవుతారు.

కానీ మనం గమనిస్తే అలా ప్రవర్తించే వారికి మొదట్లో ఏమీ జరగదు. వారు ఎన్ని హింసలు చేసినా, ఎన్ని పాపాలు చేసినా కూడా ఏమీ అవ్వదు. దానితో వారు మరీ విర్రవీగుతారు, మరీ రెచ్చిపోతారు. దానికి కారణం వారికి సృష్టి ధర్మ సూక్ష్మాల గురించి అవగాహన లేకపోవడమే. కారణం వారికి తాము ఈ సృష్టిలో వున్నామన్న అవగాహనే వుండదు. ఎంతసేపూ తనకు బలం వుంది కాబట్టి తాను ఏమి చేసినా చెల్లుతుంది. ఎలా ప్రవర్తించినా ఎవరు ఏం చెయ్యగలరు? అని శిశుపాలునిలా అహంకార భావంతో వుండడమే.

చూడండి ఒక కోడిని తిన్న వారికి కష్టం వస్తుందా? రాదు. 10 కోళ్ళు తిన్నారాదు. 50 తిన్నా రాదు. 99 తిన్నా రాదు. అలా తింటూ ఏమంటారంటే? తింటే ఏమవుతుంది? కావాలంటే ఇంకా తింటాను అంటారు. అలా తినగా, తినగా పాపం పండగానే శిక్ష పడుతుంది. అంటే ఏ ఏక్సిడెంటో అవుతుంది. కాళ్ళో, చేతులో విరుగుతాయి, ఏ రోగమో వస్తుంది, ఏ మంటల్లోనో కాలతారు. అపుడు వారు ఏడ్చినా ప్రయోజనం వుండదు.

అందుకే చూడండి చాలా మందికి వృద్ధాప్యంలోనే ఎక్కువ కష్టాలు వస్తాయి. అంటే రోగాలు వస్తాయి. భరించలేని రోగాలు వస్తాయి. కారణం వారు యవ్వనంలో ఏమీ ఆలోచించకుండా యవ్వన గర్వంతో చేసిన పాపాలే ముసలి వయస్సులో పండుతాయి. కష్టాలు వస్తాయి. ముసలి వయస్సులో కష్టాలు అనుభవించటానికి కారణం అదే. మరి యవ్వనంలో పాపాలు చేసినపుడు కష్టాలు ఎందుకు రావంటే అప్పుడు వారి పాపం పండలేదు కనుక.

అందుచేత ఈ సన్నివేశంలోని అంతరార్థం ఏమిటంటే పాపం చెయ్యగానే కష్టం రాదు. పాపం పండితేనే కష్టం వస్తుంది. లేదా రోగం వస్తుంది, సమస్యలు వస్తాయి. ఈ సన్నివేశంలో 100 తప్పులు అని చెప్పబడింది. కానీ అక్కడ 100 తప్పులు చేస్తేనే అని అర్థం కాదు. దాని అర్థం పాపం పండితేనే అని. అది సృష్టి ధర్మ సూక్ష్మాల ప్రకారం ఆధారపడి వుంటుంది. ఎన్ని తప్పులు చేస్తే ఎప్పుడు శిక్ష పడుతుంది? ఎన్ని కోళ్ళు తింటే ఎప్పుడు రోగం వస్తుంది. అన్నది సృష్టి ధర్మాన్ని అనుసరించి వుంటుంది. కానీ ముఖ్యంగా తెలుసుకోవలసింది, "శిక్ష పడాలంటే పాపం పండాల్సిందే"!.

పురాణాలలో కూడా ఈ విషయమే చూస్తూ వుంటాం. ఎప్పుడైనా


రాక్షసులతో యుద్ధం చేసినపుడు దేవతలు ఓడిపోతే దేవతలంతా వెళ్ళి విష్ణుమూర్తికి మొరపెట్టుకుంటారు. అపుడు విష్ణుమూర్తి కొంచెం ఓపిక పట్టండి, వాడి పాపం పండనివ్వండి, అపుడు వాడి సంగతి నేను చూసుకుంటాను అంటాడు.

అలాగే బుద్ధుడు కూడా చెబుతాడు "పాపం పండేంత వరకు మానవునకు సుఖ భ్రాంతి వుంటుంది. సుఖ భ్రాంతితో పాపాలు చేస్తూనే వుంటాడు, మానడు. కానీ ఆ పాపం పండగానే కష్టం వచ్చినపుడు తెలుస్తుంది ఆ కష్టాన్ని తట్టుకోవడం ఎంత దుర్భరమో! ఎంత బాధాకరమో! ఎంత నరకమో! అందుచేత ఈ విషయం ముందుగానే తెలుసుకుని ప్రతి ఒక్కరూ పాపాలు చెయ్యకూడదు. అంటే హింస చేయకూడదు. హింసకు కారణమైన మాంసం తినకూడదు.

పై వాటన్నిటిని బట్టి **"పాపం చేస్తే కష్టం రాదు, పాపం పండితేనే కష్టం వస్తుందని తెలుసుకోవాలి".**

అందుచేత తెలుసుకోండి ఏదో ఒక కోడిని చంపినంత మాత్రాన, ఒక మేకను హింసిచినంత మాత్రాన, ఒక చేపను తిన్నంత మాత్రాన కష్టాలు రావు. ఏమీ జరగదు. అందుకని అది తప్పు కాదని భావించకండి. ఆ తప్పు మరల, మరల చెయ్యకండి. జీవితాన్ని నరకం చేసుకోకండి. **"పాపం చేసినా కష్టం రాలేదంటే అది పాపం కాదని అనుకోకండి. పాపం పండలేదని తెలుసుకోండి".**

ఇదే భాగవతంలోని శిశుపాలుని సన్నివేశం ద్వారా వ్యాస భగవానుడు లోకానికి ఇచ్చిన సందేశం.



# శ్రీ కృష్ణుడు కుచేలునికి మర్యాద చెయ్యడం



శ్రీ కృష్ణుని బాల్య స్నేహితుడు, పేదవాడు అయిన కుచేలునికి మర్యాద చెయ్యడమే కాదు. కుచేలుడు ఇచ్చిన అతి సామాన్యమైన ఆహారం అటుకులు ఇష్టంతో ఆరగించాడు శ్రీ కృష్ణుడు.

ఈ సన్నివేశం యొక్క సందేశం ఏమిటంటే? ఎంతటి గొప్పవారైనా సరే పేదలను, సామాన్యులను తమతో సమానంగా చూడాలని, గౌరవించాలని తెలియ చెప్పడం. గొప్పవారు ఇచ్చే గొప్ప గొప్ప విందుల కంటే సామాన్యులు ప్రేమతో, ఆప్యాయతతో ఇచ్చేది ఏదైనా సరే ఆఖరుకు అటుకులు అయినా సరే, గొప్పగా భావించాలని, పంచభక్ష్య పరమాన్నాలుగా భావించగలగాలని శ్రీ కృష్ణుడు లోకానికి

ఈ సన్నివేశం ద్వారా బోధించాడు. అదే ఈ సన్నివేశంలోని అంతరార్థం.

అంటే సామాన్యులను తక్కువగా చూడటం, కించపరచడం, అవమానించడం చేయకూడదు. ధనముందని, అధికారముందని, గొప్పగా భావించడం గొప్పగా చూడటం చేయకూడదు. అందరూ ఒక్కటే అంతా సమానమేనని తెలుసుకోవాలి. అలాగే ప్రవర్తించాలి. అందుచేత ఉందని అహంకరించకండి, లేదని బాధపడకండి. ఈ సృష్టిలో, భగవంతునికి అంతా సమానమని తెలుసుకోండి. అదే ఈ సన్నివేశం యొక్క సందేశం.

ఇలా మనం ఆలోచిస్తే ప్రతీ సన్నివేశం ద్వారా ఒక సందేశం తెలుసుకోవచ్చు. భాగవతంలో సందేశాత్మకమైన సన్నివేశాలే వ్యాస మహర్షి మనకు ఇవ్వడం జరిగింది. అలా కాకుండా శ్రీ కృష్ణుని ఒక సంవత్సర జీవితం గురించి పూస గుచ్చినట్లు వ్రాయాలంటే కొన్ని వేల గ్రంథాలవుతాయి. అలా వ్రాయడం అసాధ్యం కూడా. అలా వ్రాసినా చదవడం కూడా సాధ్యం కాదు.

అందుచేత ఏ సన్నివేశాలయితే లోకానికి అవసరమో! లోకులకు ఆచరణీయమో! అటువంటివి మాత్రమే వ్యాస భగవానుడు ఇవ్వడం జరిగింది. అందుచేత ఆ ముఖ్య సన్నివేశాలలోని అంతరార్థం గ్రహించి వాటిని ఆచరణలో పెట్టాలి. మనం కూడా శ్రీ కృష్ణునిలా లోక కళ్యాణానికి పాటు పడాలి. అలా జీవిస్తే ఈ భూలోకమే ఒక స్వర్గం కదా? కానీ ప్రస్తుతం లోకంలో అంతా కంసులే కనిపిస్తున్నారు. అందుకే లోకం ఇలా వుంది. అందుచేత భాగవతంలోని సందేశాన్ని తెలుసుకుందాం. ఈ కలియుగాన్ని సత్యయుగంగా మారుద్దాం.



# పురాణ గాధలు - శాస్త్రాలు



పురాణ గాధలు, శాస్త్రాలు ఇవన్నీ మానవులకు మానవ లోకానికి ఒక సందేశాన్ని ఇవ్వటానికి పండితులచే, ఋషులచే వ్రాయబడినవి. వీటిలో కొన్ని జరిగి వుండవచ్చు. కొన్ని జరిగి వుండకపోవచ్చు.

అందుచేత మనం వాటిలోని అంతరార్థాన్ని తెలుసుకోవాలి. వాటి ద్వారా ఇవ్వబడిన సందేశాన్ని గ్రహించాలి. అంతేకానీ అది జరిగిందా? జరగలేదా? వాస్తవమా? కాదా? అని ఆలోచించకూడదు. వాటిలోని సందేశం తీసుకోకుండా పెడార్థాలు తీసుకుని బుర్రపాడు చేసుకోకూడదు. తెలుసుకోండి అవి అన్నీ సందేశాత్మకమైనవి మాత్రమే. పండితులు లోకానికి తాము ఇవ్వదలచుకున్న సందేశాన్ని ఈ పురాణ కథల ద్వారా ఇచ్చారు.

కొన్ని పురాణాల ద్వారా శివుడు గొప్పవాడని, కొన్ని పురాణాల ద్వారా విష్ణువు గొప్పవాడని ఆ పండితులు తెలియపరిచారు. అన్నీ కవితా చమత్కారమే తప్ప ఇంకేమీ కాదు. కారణం దేవుళ్ళంతా ఒక్కటే, వేరు వేరు కాదు. అన్నీ నేనే అంతా నేనే అని విశ్వరూపం చూపించి శ్రీ కృష్ణుడు చెప్పలేదా? "బ్రహ్మమొక్కటే! పరబ్రహ్మమొక్కటే" అని అన్నమయ్య చెప్పలేదా? "సబ్ కా మాలిక్ ఏక్ హై" అని షిరిడీ సాయిబాబా చెప్పలేదా? "నేను నా తండ్రి, నేను మీరు అంతా ఒక్కటే అని జీసస్ చెప్పలేదా? అందుచేత వాటిలోని ధర్మ సూక్ష్మాలు, సందేశాలు మాత్రమే మనం గ్రహించాలి. అంతకన్నా లోతుల్లోకి వెళ్తే అంతా గందరగోళమే.

# శిబిచక్రవర్తి



జీవులపై దయ చూపించాలని శిబిచక్రవర్తి కథ ద్వారా అందించారు పండితులు. శిబిచక్రవర్తి ఒక పావురాన్ని అంటే పక్షిని రక్షించడం కోసం తన మాంసాన్నే కోసి ఇచ్చాడు. అంటే ఆ జంతువులను, పక్షులను, అమాయకపు మూగ జీవులను రక్షించడంలోని గొప్పతనాన్ని పండితులు ఆ రకంగా వివరించారు. దాని అర్థం మనం కూడా పక్షులను అంటే కోళ్ళను, జంతువులను రక్షించాలని, చంపకూడదని, హింసించకూడదని, వాటి మాంసం తినకూడదని, వాటి మీద దయ చూపించాలన్నదే ఆ పురాణ కథ సందేశం అంతేకానీ వాటి కోసం మీ మాంసం కోసి ఇవ్వవలసిన అవసరం లేదు. వాటి మాంసం తినకుండా వుంటే చాలు.

ఆలోచించండి ఒక పక్షిని రక్షించడానికి శిబి చక్రవర్తి తన మాంసాన్నే కోసి ఇచ్చాడే! కానీ మనం మన మాంసాన్ని పెంచుకోవడానికి ఎన్ని పక్షుల మాంసాన్ని భక్షిస్తున్నాం ?

# భక్త కన్నప్ప




అలాగే భక్త కన్నప్ప కథ ద్వారా భగవంతునిపై అచంచలమైన భక్తి, విశ్వాశాలు కలిగి వుండాలనే సందేశమే కాదు, భక్తి ఎలా వుండాలో కూడా మనకి తెలియచేశారు పండితులు.

భక్త కన్నప్ప భక్తి భగవద్భక్తి. సామాన్యుల భక్తి కోరికల భక్తి.

భక్త కన్నప్ప భగవంతుని పొందాలనే ఆరాటంలో, ఆవేదనలో, ఆతృతలో, తపనలో తన్ను తాను మైమరచిపోతాడు. తాను ఏం చేస్తున్నాడో, ఏం మాట్లాడుతున్నాడో తెలియని స్థితిలో వున్నాడు. ఒక్కటే ఆరాటం. ఒక్కటే ఆవేదన. అదే భగవంతుని పొందాలని. ఆయనను దర్శించాలని.

ఆ భక్తి పారవశ్యంలో తాను ఏం చేస్తున్నాడో తెలియని స్థితికి వెళ్ళాడు. తాను చేసే పని తప్పా? ఒప్పా? అన్న ఆలోచన కూడా లేదు. ఆలోచించే స్థితి లేదు. భక్త కన్నప్ప తపన, ఆవేదన, ఆర్తి అంతా భగవంతుడే. అంతే కాదు. అతనికి భగవంతుని గురించి ఏ విషయం తెలియదు. అంతటి అమాయకుడు కన్నప్ప. భగవంతుడు ఎలా వుంటాడు? ఎక్కడ వుంటాడు? ఆయన్ను ఎలా చేరుకోవాలి? ఆయన కళ్ళకు కనిపిస్తాడా? లేదా? ఆయనకు ఆహారం

అవసరమా? లేదా? ఆయనకు ఆకలి వుంటుందా? లేదా? తింటాడా? లేదా? ఏం తింటాడు? అన్న విషయాలు తెలియని పూర్తి అమాయకపు స్థితిలో వున్నాడు.

అలాంటి స్థితిలో  భగవంతునికి మానవులలాగే ఆకలి వుంటుందేమోనని, ఆయనకు ఆకలిగా వుందేమోనని భావించి లింగానికి మాంసం నివేదించాడు. దాని అర్థం కన్నప్ప అంతటి భక్తి పారవశ్యంలో వున్నాడని చెప్పడానికే కానీ మీరు మాంసం తినవచ్చు, తినండని చెప్పడానికి కాదు, తినమని చెప్పినట్టు కాదు. అసలు కన్నప్పతో పోల్చుకోవడానికి ఈ మాంసం తినేవాళ్ళు ఎలా సరిపోతారు? కన్నప్ప వీరు ఒకటేనా?

అలాంటి సమయంలో అతని భక్తిని ఇంకా పరీక్షించడానికి భగవంతుడు కళ్ళలో నీరు కార్చాడు. అపుడు కన్నప్ప తన రెండు కళ్ళనూ పెరికిఇచ్చాడు. మీరు అలా ఇవ్వగలరా? కనీసం మీ చేయి ఇవ్వగలరా? ఆఖరుకు వేలైనా ఇవ్వగలరా? అంటే భగవంతుని కోసం ఆ పని కూడా చెయ్యలేని వాళ్ళం. కన్నప్ప మాంసం పెట్టాడని మేం మాంసం తింటామంటే వీరిని ఏమనాలి? వీరు ఎలాంటి భక్తులు? ఆలోచించండి. అందుచేత ఈ పురాణ గాధలలోని సందేశం ఏమిటని ఆలోచించాలి కానీ మరొక విధంగా ఆలోచిస్తే నష్టపోయేది మనమే.

దీని అర్థం భగవంతుని దర్శించాలనుకునేవారు అన్నిటి మీద మమకారం వదలాలి. నేను అనే భావం కూడా వదలాలివ. అలాంటి స్థితిలో పెట్టబడే పరీక్షలు కూడా కఠినమైన పరీక్షలు వుంటాయి. అవి కూడా అధిగమించగలగాలి. అప్పుడే భగవత్ సాక్షాత్కారం లభిస్తుందన్నదే ఈ కథలోని సందేశం.

అంతేకానీ నాకు కళ్ళు లేవు, కళ్ళు ఇయ్యి. నడక లేదు, కాళ్ళు ఇయ్యి. చేతులు వంకర్లు పోయాయి. చేతులు సరి చెయ్యి అని కోరేవారు వాటి కోసం ఆరాధించేవారు భక్తులు ఎలా అవుతారు?

భగవంతుని కోసం కళ్ళు ఇచ్చే వాడు, కళ్ళు పోయినా లెక్కచెయ్యని వాడు, వాడే భగవంతుని కోసం ఆరాటపడేవాడు. వాడే నిజమైన భక్తుడు. వాడే ముక్తిని పొందుతాడు. భగవంతుని అనుగ్రహాన్ని పొందుతాడు.

# యమలోకం



యమలోకంలో యమధర్మరాజు సింహాసనం మీద ఆశీనుడై వుంటాడు. ఆయన ప్రక్కనే చిత్రగుప్తుడు వుంటాడు. చిత్రగుప్తుని ఎదురుగా ఒక పెద్ద పుస్తకం వుంటుంది. ఆ పుస్తకంలో మానవుల పాప, పుణ్యాలన్నీ వ్రాయబడి వుంటాయి. అలాగే యమలోకంలో యమభటులు కూడా వుంటారు. వారు చనిపోయిన వారిని, అంటే ఆయుష్షు తీరిపోయిన వారిని యమలోకానికి తీసుకు వస్తూ వుంటారు. పాపం చేసిన వారికి యమలోకంలో శిక్షలు అమలు చేస్తూ వుంటారు. అలాగే పాపులు శిక్షలు అనుభవిస్తూ వుంటారు. క్లుప్తంగా చెప్పాలంటే పురాణాల ద్వారా పండితులు లోకానికి అందించిన యమలోకం యొక్క సారాంశం ఇదే! యమలోకం గురించి అందరికీ వున్న అవగాహన ఇదే!

కానీ మనం ఆలోచించవలసింది యమలోకం వుందా? లేదా? అని కాదు. యముడు వున్నాడా? లేడా? అని కాదు. అసలు ఈ పురాణం ద్వారా మనం

తెలుసుకోవలసిన సందేశం ఏమిటన్నదే ముఖ్యం. అంతేకాదు అసలు ఈ పురాణం ద్వారా ఆ పండితులు మానవ లోకానికి ఏ సందేశం అందించారు? అసలు ఆ సందేశం ఏమిటి? అన్నదే మనం తెలుసుకోవాలి. దానిని ఆచరణలో పెట్టాలి. అప్పుడే మన జీవితం ఆనందభరితమవుతుంది. అందుచేత ఈ పురాణం యొక్క అంతరార్థం, అందులోని సందేశం తెలుసుకుందాం!

చూడండి ఎవరైనా చనిపోయిన వెంటనే ముందు ఇద్దరు యమభటులు వస్తారు. వారు చనిపోయిన వారిని పట్టుకుని యమలోకానికి తీసుకువెళతారు. అక్కడ వారిని యముడి ముందు నిలబెడతారు. అపుడు యమధర్మరాజు ప్రక్కనే వున్న చిత్రగుప్తుణ్ణి వీడు చేసిన పాపాలేమిటో చెప్పమంటాడు. వెంటనే చిత్రగుప్తుడు తన ఎదురుగా వున్న పెద్ద పుస్తకాన్ని తెరచి అందులో పేజీలు తిప్పుతాడు. ఒక పేజీ తీస్తాడు. ఆ పేజీలో చనిపోయిన వాడి ఖాతా వుంటుంది. ఆ ఖాతా చూసి వాడు చేసిన పాపాలన్నీ చదువుతాడు. అది విని యమ ధర్మరాజు దానికి తగ్గ శిక్షలు వేస్తాడు. యమభటులు వారికి ఆ శిక్షలు అమలు చేస్తారు. ఇదే యమలోకంలో జరిగే కార్యక్రమం. కానీ ఇక్కడ ప్రతీ విషయంలో కూడా సందేశం వుంది. అదేమిటో తెలుసుకుందాం.

**"చనిపోయిన వారిని తీసుకు వెళ్ళటానికి ఇద్దరు యమభటులు వస్తారు".** సహజంగా లోకంలో ఎవరైనా ఏమనుకుంటారంటే చనిపోయిన తరువాత ఇక జీవితం లేదని అనుకుంటారు. కానీ చనిపోయిన తరువాత కూడా మనం వుంటాము. మనకు ఇంకా జీవితం వుంది అన్నదే ఈ సన్నివేశం ద్వారా మనకు ఇవ్వబడిన సందేశం.

మరి చనిపోయింది ఎవరు? అంటే శరీరం. అంటే శరీరం కాలిపోయింది, వాడు పైకి (చని..) వెళ్ళాడు (పోయాడు). అందుకే "చనిపోయాడు" అంటారు. చనిపోయాడు అంటే పైకి వెళ్ళాడు అని అర్థం. అంతేకానీ ఇక లేడు అని కాదు.

దీనిని బట్టి మనకు చావు లేదు మనకు ఇంకా జన్మలు వున్నాయని తెలుసుకోవాలి. మరి మనకు ఇంకా జీవితం వున్నప్పుడు ఆ జీవితం గురించి కూడా ఆలోచించాలి కదా? ఆ జీవితం కూడా బాగుండాలి కదా? ఆ జీవితం బాగుండడానికి ఏమి చెయ్యాలో ఆలోచించాలి కదా? మరి వీటన్నిటి గురించి ఆలోచిస్తున్నామా? లేదు. ఎందుచేత ఈ విషయం తెలియక అందుకే ఆ పండితులు ఈ పురాణం ద్వారా మనకు ఇంకా జీవితం వుంది అన్న సందేశం మనకు ఇచ్చారు.

అంతేకాదు. ఈ సృష్టిలో మనకు కనబడే భూలోకమే కాదు. కనిపించని లోకాలు అనేకం వున్నాయని చెప్పడమే ఈ సన్నివేశంలోని మరొక సందేశం. దీనిని బట్టి మనం ఈ శరీరంతో కొంతకాలం... కనిపించే ఈ లోకంలో వుంటాము. ఆ

శరీరం వదలగానే కనిపించని రూపంతో కనిపించని లోకాలకు వెళతామని కూడా తెలుసుకోవచ్చు. అంతేకాదు. భూమి మీద మనం చేసిన కర్మలను బట్టి ఏ లోకానికి చేరుకోవాలో ఆ లోకానికి అదృశ్యరూపులైన మాష్టర్సు ఇద్దరు వచ్చి మనల్ని తీసుకు వెళతారని చెప్పడానికే యమభటులు వస్తారని చెప్పడంలోని అంతరార్థం. అంటే ఈ ఒక్క సన్నివేశంలో ఎంత అర్థం వుందో మనం తెలుసుకోవచ్చు. ఈ సన్నివేశం ద్వారా ఆ పండితులు ఎంత సందేశం ఇచ్చారో కూడా తెలుసుకోవచ్చు.

అలా **"యమభటులు చనిపోయిన వారిని యమలోకానికి తీసుకుని వెళ్ళి యముని ముందు నిలబెడతారు. అపుడు యముడు చిత్రగుప్తునితో వీడు చేసిన పాపాలేమిటి? అని అడుగుతాడు. అపుడు చిత్రగుప్తుడు తన దగ్గర వున్న పెద్ద పుస్తకం తిరగేసి వాడి ఖాతా తీస్తాడు".**

దీనిని బట్టి పాపాలు చేసిన వారు ఎవరైనా! ఎంతటి వారైనా సరే, తరువాత లెక్కలు చెప్పవలసి వస్తుందని తెలుసుకోవాలి. అందుచేత మనం చేసే పనులు అడిగేవారు లేరు అని అనుకోవద్దు. కచ్చితంగా మనం చేసే ప్రతీ పనికి మనం సమాధానం చెప్పవలసి వస్తుంది. అందుచేత చేసే ప్రతీ పని ఆలోచించి చెయ్యాలన్నదే దీనిలోని సందేశం. అంతేకాదు భూమి మీద ఎంతటి గొప్పవారైనా తప్పులు చేస్తే ఈ సృష్టిలో ఒకే న్యాయస్థానంలో సమానంగా దోషులుగా నిలబడవలసి వస్తుందని, మనం చేసిన తప్పులకు, పాపాలకు సమాధానం చెప్పుకోవలసి వస్తుందన్నదే ఈ సన్నివేశంలోని మరొక సందేశం.

చిత్రగుప్తుని వద్ద చిటా వుంది అంటే అర్థం ఈ సృష్టిలో ఎవరు ఏమి చేసినా? ఎలాంటి కర్మలు చేసినా అన్నీ రికార్డు చెయ్యబడతాయని తెలుసుకోవాలి. సాధారణంగా మనం తప్పులు, పాపాలు చేసేస్తూ అవి ఎవరూ చూడట్లేదని అనుకుంటాం. ఎవరికీ తెలియదని అనుకుంటాం. కానీ ఇక్కడ ఎవరూ చూడకపోయినా ఈ సృష్టిలో మనం చేసే ప్రతీ పని, ప్రతీక్షణం రికార్డు చేయబడుతుంది. ఆ పనిని మనం ఎంతమారుమూల ప్రదేశంలో చేసినా, గదిలో తలుపులన్నీ వేసి చేసినా, చీకటి గుహలో చేసినా! అన్నీ రికార్డు చేయబడతాయని తెలియచెప్పేదే చిత్రగుప్తుని చిటా. అంటే ఈ సృష్టిలో ప్రతి ఒక్కరికి ఒక ఖాతా వుంటుంది. మన కర్మలు రికార్డు చేయబడతాయని ఆ పండితులు ఈ సన్నివేశం ద్వారా మనకు సందేశాన్ని ఇచ్చారు. ఆధ్యాత్మిక పరిభాషలో చిత్రగుప్తుని చిటానే "ఆకాశిక్ రికార్డ్సు" అంటారు.

తరువాత **"చిత్రగుప్తుడు వాడు చేసిన తప్పులు ఒక్కొక్కటి చదువుతాడు"**.

అంటే వాడి జీవితంలో ఎన్ని కోళ్ళు తిన్నాడో! ఎన్ని మేకలను చంపాడో! ఎన్ని చేపలను వూసకు గుచ్చి నూనెలో వేయించాడో! చెపుతాడు. ఇంకా వాడు

ఎంత మందిని మోసగించాడు, ఎంతమంది మీద దౌర్జన్యం చేసాడు, అవమానించాడు, నష్టపరిచాడు, కష్టాలు పాలు చేసాడు అన్నవి కూడా చదువుతాడు. అంతేకాదు ఎవరు ఎవరి కాలు తీసినా, ఎవరి చేయి నరికినా, ఎవరిపై యాసిడ్ పోసినా, భార్యను శారీరకంగా హింసించినా, అంటే ఎవరు ఏమి చేస్తే అది, ఎన్ని చేస్తే అన్నీ చదువుతాడు అంటే అర్థం మనం చేసిన ప్రతీ పని, ప్రతి తప్పు, ప్రతీ పాపం పూసగుచ్చినట్టు రికార్డు చెయ్యబడతాయని తెలుసుకోవాలి. ఎవరూ చూడట్లేదని అనుకోకూడదనే దీనిలోని సందేశం.

మరి ఎప్పుడు అనుభవిస్తారు? ఎక్కడ అనుభవిస్తారు? ఎలా అనుభవిస్తారు? అంటే పాపం పండినప్పుడు భూమి మీద కష్టాల రూపంలో, రోగాల రూపంలో, ఏక్సిడెంట్ల రూపంలో కచ్చితంగా అనుభవిస్తారు. అనుభవిస్తారు కాదు అనుభవిస్తున్నారు కూడా.

అపుడు **"యమధర్మరాజు వాడు చేసిన పాపాలకు తగ్గ శిక్ష విధిస్తాడు". అంటే కోడికాళ్ళు నరికాడు అంటే వీడి కాళ్ళు నరుకు. చేపలను నూనెలో వేయించాడు అంటే వీడిని కూడా నూనెలో వేయించు. వీడు భార్యను కొట్టాడు అంటే వాడిని కూడా కొరడాలతో కొట్టు అని యమభటులకు యమధర్మరాజు ఆజ్ఞాపిస్తాడు. అప్పుడు యమ కింకరులు శిక్షలు అమలు చేస్తారు".**

ఈ సన్నివేశం యొక్క అర్థమేమిటంటే అక్కడ యముడు శిక్షలు వేస్తాడు, యమభటులు శిక్షలు అమలు చేస్తారని కాదు. ఈ సృష్టిలో ఎవరైనా సరే చేసిన పాపాలకు శిక్ష అనుభవించవలసిందే. అంటే కష్టాల పాలు కావలసిందేనని చెప్పడమే




ఈ సన్నివేశ సందేశం. అంతేకాదు ఎలాంటి పాపాలు చేస్తే అలాంటి శిక్ష అనుభవించవలసివస్తుంది. ఎంత చేస్తే అంత శిక్ష అనుభవించాలని తెలియ చెప్పడమే ఈ సన్నివేశ సందేశం.

అంతేకానీ మనం చేసిన పాపాలకు శిక్షలు పైన అనుభవించం. కష్టాల రూపంలో ఇక్కడే అనుభవిస్తాం. ఎందుచేతనంటే దేహంతో చేసిన పాపాలకు దేహానికే శిక్ష వెయ్యగలరు కానీ దేహం వదిలిన ఆత్మను ఎవరు శిక్షించగలరు? ఆత్మను ఎవరు ఏమీ చేయలేరనేగా శ్రీ కృష్ణ భగవానుడు కూడా చెప్పింది. "ఆత్మను అగ్ని దహించలేదు, నీరు తడుపలేదు. శస్త్రం ఛేధించలేదు. వాయువు ఆర్పివేయను జాలదు" అని చెప్పలేదా?

అందుచేత ఆత్మను ఎవరూ ఏమీ చెయ్యలేరు. దేహంతో చేసిన పాపాలకు శిక్షలు దేహంతోనే అనుభవించాలి. అందుచేత మనం ఎలాంటి హింస చేస్తే అలాంటి హింస అనుభవిస్తామని, ఎలాంటి పాపాలు చేస్తే అలాంటి నరకం అనుభవిస్తామని ఎలాంటి తప్పులు చేస్తే అలాంటి శిక్షలు భూమి మీదే దేహంతో అనుభవిస్తామని ఆ పండితులు యమలోకం సన్నివేశం ద్వారా మనకు సందేశం ఇవ్వడం జరిగింది. అందుచేత ఇది గ్రహించి మనం తప్పులు చేయకూడదు. పాపాలు చెయ్యకూడదు. జీవహింస చెయ్యకూడదు. మాంసం తినకూడదని తెలుసుకోవాలి.

అంతేకానీ యమలోకం వుందా? లేదా? యముడు వున్నాడా? లేదా? అన్నది ముఖ్యం కాదు. ఈ పురాణం ద్వారా ఆ పండితులు లోకానికి ఏం సందేశం అందించారు అన్నదే ముఖ్యం. అందుచేత పురాణాలను సందేశాత్మకంగా చూస్తే మనం ఎంతో లాభం పొందుతాం. కానీ విమర్శనాత్మకంగా చూస్తే అంతా గందరగోళమే. అంతా నష్టమే.



# భక్త మార్కండేయ



భక్తమార్కండేయుడు శివభక్తుడు, స్వల్ప ఆయుష్షుతో జన్మ తీసుకున్నాడు. తాను ఇంకా జీవించాలనే ఉద్దేశ్యంతో శివుణ్ణి ఆశ్రయించాడు. అంటే మన లెఖ్ఖ ప్రకారం శివలింగమే శివుడు కాబట్టి శివలింగాన్ని ఆశ్రయించాడు అని చెప్పుకుంటాం. మార్కండేయునికి ఆయుష్షు తీరిపోయింది, మరణ సమయం

ఆసన్నమయ్యింది. యధాప్రకారం యముడు మార్కండేయుని ప్రాణం అంటే ఆత్మను తీసుకు వెళ్ళడానికి వస్తాడు. కానీ మార్కండేయుడు శివలింగాన్ని పట్టుకుని వదలలేదు అంటే శివుణ్ణి గట్టిగా పట్టుకున్నాడు అంటే ఆశ్రయించాడని మనం చెప్పుకుంటాం. అయినా సరే యమ ధర్మరాజు మార్కండేయుని తీసుకు వెళ్ళటానికి ప్రయత్నించగా శివుడు ప్రత్యక్షమై యముణ్ణి శిక్షించబోయాడు. నన్ను ఆశ్రయించిన భక్తుణ్ణి నువ్వెలా తీసుకు వెడతావు? అని అనగానే యముడు శివునికి నమస్కరించి మార్కండేయుని వదిలేసి వెళ్ళిపోతాడు. ఇది సూక్ష్మంగా ఈ పురాణ గాధ. ఇందులోని అంతరార్థం తెలుసుకుందాం.

మార్కండేయుడు అంటే మానవుడు, శివుడు అంటే ఆత్మ, యముడు అంటే మృత్యువు అని అర్థం.

మార్కండేయుడు స్వల్ప ఆయుష్షుతో జన్మించాడు అంటే మార్కండేయుడే కాదు. మానవులంతా అల్పాయుష్కులే. కారణం పైన వున్న దేవుళ్ళు, దేవతలతో పోల్చితే మానవుని ఆయుష్షు అంటే జీవితం చాలా స్వల్పం, అల్పం. అందుకే మానవ జీవితాన్ని గాలి బుడగతో పోలుస్తారు. తృణప్రాయం అని కూడా అంటారు.

మార్కండేయుని వృత్తాంతం నుంచి మరొక విషయం తెలుసుకోవాలి. ఎవరైనా సరే ఆయుష్షు తీరిపోతే శరీరం వదిలివేయవలసిందే. ఒకవేళ శరీరం వదలకూడదని మీరు నిశ్చయించుకుంటే! అంటే మీరు ఇంకా భూమి మీద వుండాలని నిశ్చయించుకుంటే! అంటే మీరు ఇంకా భూమి మీద యీ శరీరంతో ఉండదలచుకుంటే మార్కండేయునిలా మీరు కూడా శివుణ్ణి ఆశ్రయించాలి. అంటే ఆత్మను ఆశ్రయించాలి. అపుడు యముడు అంటే మృత్యువు మిమ్మల్ని ఏమీ చెయ్యలేదు అంటే మీకు చావు రాదు అని అర్థం.

ఆ స్థితి రావాలంటే యీ సన్నివేశంలోని అసలు అర్థం తెలుసుకోవాలి. శివుడు అంటే లింగం కాదు 'ఆత్మ'. ఈ విషయమే వేమన యోగి స్పష్టంగా చెప్పడం జరిగింది. ఆయన ఏమన్నారంటే.

శిలలను చూసి నరులు శివుడని భావింత్రు
శిలలు శిలలె కాని శివుడు కాదు
తనదులోని శివుడు తానేల తెలియడో!
విశ్వదాభిరామ వినుర వేమ.

తా:- శిలను అంటే రాయిని చూసి మానవులు శివుడని భావిస్తున్నారు. కానీ రాయి రాయే తప్ప శివుడు ఎలా అవుతాడు? మానవులు ఆత్మ రూపంలో తనలో వున్న శివుణ్ణి ఎందుకు తెలుసుకోలేకపోతున్నారు? అని వేమన యోగి ప్రశ్నిస్తున్నాడు.

అందుకే ఆంజనేయస్వామి రాముణ్ణి తన హృదయాన్ని చీల్చి చూపించాడు.

ఇది మనం అర్థం చేసుకుంటే మార్కండేయుని వృత్తాంతమంతా చక్కగా అర్థమవుతుంది. ఇది అర్థం చేసుకోకపోతే మీరు ఎప్పటికీ మార్కండేయులు కాలేరు. శివుని రక్ష పొందలేరు.

అందుచేత శివుణ్ణి ఆశ్రయించడమంటే ఆత్మను ఆశ్రయించాలని అర్థం. ఆత్మను ఆశ్రయించాలి అంటే ఆత్మ ఎక్కడ వుంది? ఆత్మ అందరిలోనూ వుంది, నీలోనూ వుంది. శివుణ్ణి గట్టిగా పట్టుకోవడమంటే నీలోని ఆత్మను గట్టిగా పట్టుకోవాలని అర్థం. ఆత్మను గట్టిగా పట్టుకోవడమంటే నిరంతరం ఆత్మతో వుండాలి. ఆత్మ స్థితిలో వుండాలి. అలా ఆత్మతో వుండే మార్గమే "శ్వాస మీద ధ్యాస ధ్యానం".

అలా ఎవరైతే నిరంతరం ధ్యాన స్థితిలో వుంటారో అంటే బాహ్య విషయాల మీద దృష్టి వుంచకుండా ఆత్మతతోనే వుంటారో! అంటే శివుణ్ణి పట్టుకుంటారో! వారికి చావు వుండదు. అంటే శరీరం వదలవలసిన అవసరం రాదు. అంటే వారిని యముడు ఏమీ చేయలేడని అర్థం.

అందుచేత తెలుసుకోండి "ఆత్మకు దగ్గరవుతే శివునికి దగ్గరైనట్టే. అలాంటి వారికి యముడు దూరమైనట్టే! అంటే మృత్యువు దూరమైనట్టే! అంటే చావు లేనట్టే!"

అలా ఎంతోమంది యోగులు నిరంతర ధ్యాన స్థితిలో వుంటూ కొన్ని వందల వేల సంవత్సరాలు శరీరంతో వున్నారని చెప్పుకుంటాం. అలా మహావతార్ బాబాజీ వున్నారని చెప్పుకుంటారు. అలాగే రాఘవేంద్రస్వామి ఆయన సమాధిలోనే ఇంకా ధ్యాన స్థితిలో వున్నారని చెప్పుకుంటారు. అలాగే వెంకటేశ్వరస్వామి కూడా ధ్యాన స్థితిలో ఇంకా వున్నారని చెప్పుకుంటారు.



అలాగే భక్తమార్కండేయుడు కూడా ఆత్మను పట్టుకోవడం వల్ల అంటే ధ్యానం చేస్తూ ఆయుష్షు తీరిపోయినా యముణ్ణి రానివ్వలేదు. అంటే చావును అంటే మృత్యువును జయించాడు. అంటే మనం కూడా నిరంతరం ధ్యానంలో వుంటే మనం కూడా మరణం లేకుండా చేసుకోవచ్చు. మనకు కావలసినంత కాలం శరీరంతో వుండవచ్చు.

మరి "శ్వాస మీద ధ్యాస" ద్వారా ఆత్మతో ఎలా వుండగలమో తెలుసుకుందాం. ముందు మనమంటే దేహం ఒక్కటే కాదు. దేహంతో పాటు మనస్సు, ఆత్మ కూడా వున్నాయని తెలుసుకోవాలి. మరి మనలో వున్న ఆత్మతో ఎలా వుండాలో తెలుసుకుందాం.

మనం కనుక కళ్ళు తెరచి వుంచితే దేహంతో వుంటాం. కానీ మనం ఆత్మతో వుండాలి కనుక మొదట కళ్ళు మూస్తాం. ఎప్పుడయితే కళ్ళు మూస్తామో వెంటనే ఆలోచనలు వస్తాయి. అంటే మనం ఇప్పుడు దేహంతో లేము. ఆలోచించేది మనస్సే కాబట్టి మనం మనస్సుతో వున్నట్టు. కానీ మనం వుండవలసింది మనస్సుతో కాదు, ఆత్మతో. అందుచేత ఆలోచనలను శ్వాసమీదకు మళ్ళిస్తాం. అలా చేస్తూంటే మెల్లిగా ఆలోచనలు తగ్గుతాయి. అలా ఆలోచనలు తగ్గి తగ్గి ఒక స్థితిలో ఆలోచనలన్నీ ఆగిపోతాయి. ఆలోచనలు లేవు అంటే మనస్సు లేనట్టే కదా? అంటే ఈ స్థితిలో దేహంతోనూ లేము, మనస్సుతోనూ లేము. ఇక వున్నది ఆత్మే కదా? అంటే ఈ స్థితిలో మనం ఆత్మతో వున్నట్టు, మరి ఆత్మతో వుంటే మనం శివుడితో వున్నట్టే కదా? అలా మనం శివుడితో వున్నప్పుడు యముడు మనల్ని ఏమి చెయ్యగలడు? మన దగ్గరకు వచ్చే సాహసం చెయ్యగలడా? అందుచేత ధ్యానం చేస్తే యముడైనా పారిపోవలసిందే. అంటే మృత్యువు మనల్ని ఏమి చెయ్యలేదని తెలుసుకోవాలి? మృత్యువైనా పారిపోవలసిందే.

దీనిని బట్టి మనం అర్థం చేసుకోవలసింది ధ్యాన స్థితిలో వుండేవారు వారు కోరుకున్నంత కాలం ఆయుష్షు తీరిపోయినా జీవించగలరని తెలుసుకోవాలి. అంటే శరీరంతో వుండగలరని తెలుసుకోవాలి. ఇదే మనం మార్కండేయ పురాణం నుంచి తెలుసుకోవలసిన సందేశం. తెలుసుకోండి, ధ్యానం చేస్తే ఆత్మను అంటే శివుణ్ణి ఆశ్రయించినట్టు. పూజ చేస్తే లింగాన్ని అంటే రాయిని ఆశ్రయించినట్టు. అందుచేత ధ్యానం చెయ్యండి. శివుణ్ణి ఆశ్రయించండి.


## ధ్యానం చెయ్యకపోతే యముడు దగ్గరవుతాడు - ధ్యానం చేస్తే యముడు దూరమవుతాడు

## ధర్మవ్యాధుడు

తల్లిదండ్రులను గౌరవించాలి, సేవ చెయ్యాలి అన్న సందేశాన్ని "ధర్మవ్యాధుడు" కథ ద్వారా పండితులు అందించారు. అంతేకానీ అక్కడ ఆయన వృత్తి ప్రధానం కాదు. అలాంటి వృత్తి చేసినా కూడా తల్లిదండ్రులను గౌరవించడం వల్ల ఆయన గొప్ప జ్ఞాని కాగలిగాడు అన్నదే అక్కడి సందేశం. ఈ కథ ద్వారా తల్లిదండ్రులను గౌరవించడంలోని గొప్పతనాన్ని తెలుసుకోవాలి.

## పతివ్రతలు

భర్తను గౌరవించాలి అన్న సందేశాన్ని పతివ్రతల కథలు అంటే సతీ సావిత్రి, సతీ అనసూయ లాంటి వారి కథల ద్వారా ఇచ్చారు. అంతేకానీ భర్త హింసించినా భార్య పడి వుండాలి అన్నది కాదు అక్కడి సందేశం.



## ధ్యానం చేసే పద్ధతి
## శ్వాసమీద ధ్యాస



ఎవరికి తగిన సుఖాసనంలో వారు హాయిగా కూర్చుని... చేతులు రెండూ కలిపి... కళ్ళు రెండూ మూసుకుని... ప్రకృతి సహజంగా జరుగుతున్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ వుండాలి!

మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు 'కట్' చేస్తూ... మళ్ళీ, మళ్ళీ శ్వాస మీదకే... ధ్యాస మరల్చుతూ వుంటే.. క్రమ క్రమంగా... ఆలోచనా రహిత స్థితి కలుగుతుంది.... చిత్తవృత్తులు నిరోధించబడతాయి... మనస్సు నిర్విషయం, శూన్యం అయిపోతుంది. మనస్సు శాంతిస్తుంది. ఇదే ధ్యాన స్థితి.

ఈ ఆలోచనా రహిత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీ మండల, ఆత్మానుభవాలను గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో విశ్వమయ ప్రాణశక్తి. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీ మండలాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శక్తి వల్ల రోగాలన్నీ తగ్గుతాయి. నాడీమండల శుద్ధి వల్ల కర్మలు పోతాయి.

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంతుంటుందో... కనీసం అన్ని నిమిషాలు... తప్పనిసరిగా... రోజుకి రెండు సార్లుగా... ధ్యానం చెయ్యాలి.



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...

తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

# ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం

కడ్తాల్‌లో ప్రతీ నెలా 26, 27, 28 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన **ఆత్మ జ్ఞాన శిక్షణా శిబిరం** నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.

**ప్రవేశం** : భోజనం, అన్ని వసతులతో కలిపి మూడు రోజులకు రూ. 250/-లు మాత్రమే.

**శిబిర వేదిక :** మహేశ్వర మహా పిరమిడ్, కడ్తాల్ గ్రామం, (హైదరాబాద్-శ్రీశైలం రహదారి)

వివరాలకు :

**తటవర్తి వీరరాఘవరావు,** తటవర్తి వారి వీధి, భీమవరం - 534 201.

# తటవర్తి వీరరాఘవరావు గారి ప్రచురణలు

| | | | |
|---|---|---|---|
| 1) | జీవితశాస్త్రం (మొదటి భాగం) | - | రూ.70/- |
| 2) | జీవితశాస్త్రం (రెండవ భాగం) | - | రూ.60/- |
| 3) | జీవిత సూక్ష్మాలు | - | రూ.60/- |
| 4) | జీవిత సత్యాలు | - | రూ.70/- |
| 5) | భగవంతుడంటే | - | రూ.60/- |
| 6) | సత్యమార్గం | - | రూ.60/- |
| 7) | ఆత్మ శాస్త్రం | - | రూ.70/- |
| 8) | ధ్యాన శాస్త్రం | - | రూ.70/- |
| 9) | జ్ఞానరసగుళికలు (పత్రీజీ) | - | రూ.70/- |
| 10) | పరమగురువుల ప్రబోధాలు (పత్రీజీ) | - | రూ.70/- |
| 11) | భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం | - | రూ.70/- |
| 12) | ధ్యాన శక్తి | - | రూ.70/- |
| 13) | తెలుసుకోండి | - | రూ.70/- |
| 14) | జ్ఞానజ్యోతి | - | రూ.30/- |
| 15) | శాస్త్రాల అర్థం - అంతరార్థం | - | రూ.25/- |
| 16) | షిరిడీ సాయి సందేశాలు | - | రూ.25/- |
| 17) | భాగవత సన్నివేశాల అంతరార్థం | - | రూ.25/- |
| 18) | ధ్యానం | - | రూ.25/- |
| 19) | విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య | - | రూ.25/- |
| 20) | భూతదయే దైవత్వం | - | రూ.25/- |
| 21) | నవ విధ ధర్మాలు (పత్రీజీ) | - | రూ.12/- |
| 22) | శాకాహారమే మానవాహారం | - | రూ.10/- |
| 23) | అహింస మరియు శాఖాహారం | - | రూ.10/- |

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు,** తటవర్తివారి వీధి, భీమవరం - 534 201. ప॥గో॥జిల్లా. ఫోన్ : 08816 - 234353, సెల్ : 9440309812



లోకంలో శ్రీ కృష్ణ భగవానుని జీవితంలో జరిగిన సంఘటనలు సినిమాల రూపంలో, నాటకాల రూపంలో, టి.వి. సీరియల్స్ రూపంలో చిత్రించుకుని చూసి వినోదిస్తున్నారు, కాలక్షేపానికి ఉపయోగించుకుంటున్నారు. కానీ అంతటి మహానుభావుని జీవిత చరిత్ర వినోదంగా చూడటానికి వ్యాస మహర్షి లోకానికి ఇవ్వలేదు. శ్రీ కృష్ణుని జీవితంలోని ప్రతీ సన్ని వేశం ద్వారా ఒక సందేశాన్ని లోకానికి అందివ్వడం జరిగింది. అందుచేత ప్రతీ సన్నివేశాన్ని "వినోదాత్మకంగా కాదు. సందేశా త్మకంగా చూడాలి". వినోదానికి ఉపయోగిం చుకోవడం కాదు. ఆ సన్నివేశంలోని అంతరార్థాన్ని తెలుసు కుని, ఆ సందేశాలను ఆచరణలో పెట్టాలి. అపుడే ఎవరి జీవితమైనా ధన్యమవుతుంది.

భాగవతంలోని కొన్ని సన్నివేశాల యొక్క అంతరార్థాన్ని ఈ పుస్తకం ద్వారా తెలియచేయడం జరిగింది. పాఠకులు సహృదయంతో గ్రహించి ఆచరణలో పెట్టి జీవితాన్ని ధన్యం చేసుకుంటారని ఆశిస్తూ...

మీ...

రూ. 25/-

**తటవర్తి వీరరాఘవరావు**